





Truth of News

RNI NO : APTEL/25/A0239

# సూర్య వాస్తవం

http://www.suryavastavam.in

చీఫ్ ఎడిటర్ : మొఘల్ ఇర్షాద్ బేగ్



IRS PUBLICATIONS

irspublications12@gmail.com



సంపుటి: 01 | చిత్తూరు | సంచిక : 61 | ఆదివారం 27 జూలై 2025 | పేజీలు : 8 | వెల రూ.6.50

Circulated from Hyderabad, Vishakapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Anantapuram, kadapa, kurnool, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bengalore, Mumbai, New Delhi




## విద్యార్థుల ఆత్మహత్యలపై కదిలిపోయిన సుప్రీంకోర్టు..

- నివారణకు సంచలన మార్గదర్శకాలు
- దేశంలోని ప్రతి 100 ఆత్మహత్యలలో 8 మంది విద్యార్థులు
- ఆత్మహత్యల నివారణకు 15 సమగ్ర మార్గదర్శకాలు విడుదల చేసిన సుప్రీంకోర్టు - ఎన్‌సీఆర్బీ 2022 డేటా ఆధారంగా జారీ - విశాఖపట్నంలో 'నీట్' విద్యార్థి ఆత్మహత్యపై సీబీఐ దర్యాప్తునకు ఆదేశం


2లో



## టీఆర్ఎఫ్‌ను ఉగ్రసంస్థగా ప్రకటించిన అమెరికా..

- ఎలాంటి అభ్యంతరం లేదన్న పాక్
- అగ్రరాజ్యం నిర్ణయంపై తాజాగా స్పందించిన పాకిస్థాన్
- ఈ మేరకు ఆ దేశ విదేశాంగ మంత్రి ఇషాక్ దార్ వెల్లడి

2లో



## ఏపీ డీఎస్పీల మృతి

- యాదాద్రి జిల్లా చౌటుప్పల్ మండలంలో రోడ్డు ప్రమాదం
- డివైడర్‌ను ఢీకొట్టిన పోలీసు వాహనం

చౌటుప్పల్ - సూర్య వాస్తవం, జూలై 26

యాదాద్రి జిల్లా చౌటుప్పల్ మండలం లో జరిగిన ఘోర రోడ్డు ప్రమా దంలో ఏపీకి చెందిన

2లో

### ఢిల్లీలో సిద్ధరామయ్య, డీకే శివకుమార్

# ఓఎస్డీల పరస్పర దాడి



- కర్ణాటక భవన్‌లో సీఎం ప్రత్యేక అధికారి మోహన్ కుమార్, డిప్యూటీ సీఎం శివకుమార్ ఓఎస్డీ మధ్య ఘర్షణ
- తనను షూతో కొట్టాడని శివకుమార్ ఓఎస్డీ ఆరోపణ
- ఆంజనేయనే తనతో దురుసుగా ప్రవర్తించారని ముఖ్యమంత్రి ఓఎస్డీ ఆరోపణ

బెంగళూరు- సూర్య వాస్తవం, జూలై 26

కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌ల ఓఎస్డీలు ఇటీవల ఢిల్లీలో పరస్పరం దాడి చేసుకున్నట్లు మీడియా కథనాలు వస్తున్నాయి. ముఖ్యమంత్రి మార్పు అంశం కర్ణాటక రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారిన విషయం తెలిసిందే. ఐదేళ్లూ తానే ముఖ్యమంత్రిని అని సిద్ధరామయ్య చెబుతుండగా, కాంగ్రెస్ అధిష్ఠానం ఏం చెబితే అదే తనకు శిరోధార్యం అని డీకే శివకుమార్ చెబుతున్నారు. ఈ సమయంలో మరో కీలక విషయం వెలుగు చూసింది. ఇటీవల ఢిల్లీలోని కర్ణాటక భవన్‌లో ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రుల ప్రత్యేక అధికారులు పరస్పరం దాడి చేసుకున్నట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. సిద్ధరామయ్య వద్ద ఓఎస్డీగా విధులు నిర్వహిస్తున్న మోహన్ కుమార్ అనే అధికారి తనను షూతో కొట్టినట్లు శివకుమార్ వద్ద పనిచేసే ఓఎస్డీ ఆంజనేయ ఆరోపించారు. షూతో కొట్టి పార్టీ నేతల ముందు తన గౌరవానికి

- మిగతా 2లో..

### గోవా గవర్నరుగా

## అశోక్ గజపతిరాజు ప్రమాణ స్వీకారం

- హాజరైన కేంద్ర మంత్రి, రాష్ట్ర మంత్రులు, ఎంపిలు

న్యూఢిల్లీ - సూర్య వాస్తవం, జూలై 26



కేంద్ర మాజీ మంత్రి అశోక్ గజపతిరాజు గోవా గవర్నరుగా ప్రమాణ స్వీకారం చేశారు. పిఎస్ శ్రీధరన్ పిళ్లై స్థానంలో ఆయన ఆ బాధ్యతలను స్వీకరించారు. గోవా రాజధాని పనాజీలోని రాజ్‌భవన్‌లో శనివారం జరిగిన కార్యక్రమంలో ముంబయి హైకోర్టు చీఫ్ జస్టిస్ అలోక్ ఆరాధే ఆయనతో ప్రమాణ స్వీకారం చేయించారు. ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్‌తోపాటు కేంద్ర మంత్రులు కె రామ్మోహన్‌నాయుడు, శ్రీనివాసవర్మ, రాష్ట్ర అసెంబ్లీ స్పీకరు చింతకాయల అయ్యన్న పాత్రుడు, రాష్ట్ర మంత్రులు నారా లోకేష్, గుమ్మడి సంధ్యారాణి, కొండపల్లి శ్రీనివాస్, ఎంపిలు కలిశెట్టి అప్పలనాయుడు, అశోక్ గజపతిరాజు కుటుంబ సభ్యులు తదితరులు పాల్గన్నారు. అశోక్ గజపతి రాజును మంత్రి నారా లోకేష్ ఘనంగా సత్కరించి శు భాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమానికి హాజరైన గోవా ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్‌ను మర్యాద పూర్వకంగా కలిసి ఆయనను

- మిగతా 2లో..

### తలసరి ఆదాయంలో

## దేశంలోనే కర్ణాటక నంబర్ వన్

- హామీ పథకాలే కారణం: సీఎం సిద్ధరామయ్య!

హసన్- సూర్య వాస్తవం, జూలై 26




తలసరి ఆదాయంలో దేశంలోనే కర్ణాటక నంబర్ వన్ స్థానంలో ఉందని.. రాష్ట్ర ప్రభుత్వ హామీ పథకాలే దీనికి ప్రధాన కారణమని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య శనివారం అన్నారు. అరసికెరె అసెంబ్లీ నియోజకవర్గంలో పలు అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించి, శంకుస్థాపన చేసిన తర్వాత ముఖ్యమంత్రి మాట్లాడుతూ, తలసరి ఆదాయంలో కర్ణాటక దేశంలోనే నంబర్ వన్ స్థానంలో ఉందని అన్నారు. దీనికి ప్రధాన కారణం ప్రజల కొనుగోలు శక్తి పెరుగుదల. కొనుగోలు శక్తి పెరుగుదలకు మన హామీ పథకాలే ప్రధాన కారణమని ఆయన సమర్థించారు. బిజెపికి ఆర్థిక వ్యవస్థ అర్థం కాలేదు. అందుకే వారు అబద్ధాలు వ్యాప్తి చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం వద్ద అభివృద్ధికి డబ్బు లేదని ప్రచారం చేస్తున్నారు. రాజకీయ ప్రేరేపిత అబద్ధాలు చెప్పి రాష్ట్ర ప్రజలను తప్పుదారి పట్టించడానికి ప్రయత్నించినా, రాష్ట్ర ప్రజలు మోసపోరని వారు అన్నారు.

- మిగతా 2లో..

# సింగపూర్ పర్యటనకు సీఎం చంద్రబాబు

- చంద్రబాబు వెంట లోకేశ్, నారాయణ, టీజీ భరత్
- ఐదు రోజుల పాటు సింగపూర్‌లో పర్యటన
- బ్రాండ్ ఏపీ ప్రమోషన్ ద్వారా పెట్టుబడుల సాధనే లక్ష్యం



అమరావతి-సూర్య వాస్తవం, జూలై 26

ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు శనివారం హైదరాబాద్ నుంచి సింగపూర్ పయనమయ్యారు. ఈ పర్యటనలో సీఎం చంద్రబాబు వెంట మంత్రులు నారా లోకేశ్, టీజీ భరత్, పి.నారాయణ, ఉన్నతాధికారులు కూడా పాల్గొంటారు. బ్రాండ్ ఏపీ ప్రమోషన్ ద్వారా పెట్టుబడుల సాధన కోసం చంద్రబాబు బృందం సింగపూర్ లో 5 రోజుల పాటు పర్యటించనుంది. ఈ పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రముఖ సంస్థల ప్రతినిధులు, ప్రముఖులు, ఇండస్ట్రియలిస్టులతో భేటీ కానున్నారు. సింగపూర్ లో తెలుగు డయాస్పొరా ఫ్రమ్ సౌత్ ఈస్ట్ ఏషియా కార్యక్రమానికి కూడా చంద్రబాబు హాజరుకానున్నారు. ఈ కార్యక్రమానికి సింగపూర్, మలేషియా, ఇండోనేషియాలోని

- మిగతా 2లో..



## మాల్దీవులుతో సంబంధాల పెంపునకు ఆసక్తి

- పలువురు నేతలతో మోడీ భేటీ

మాలె -సూర్య వాస్తవం, జూలై 26

మాల్దీవులుతో భాగస్వామ్యాన్ని పెంపొందించుకోవాలని భారత్ భావిస్తోందని ప్రధాని మోడీ చెప్పారు. మాల్దీవులు ఉపాధ్యక్షుడు యుజ్ హుస్సేన్ మహ్మద్ లతీఫ్, పార్లమెంట్ స్పీకర్ అబ్దుల్ రహీమ్, మాజీ అధ్యక్షుడు మహ్మద్ నషీద్‌లతో

- మిగతా 2లో..


సూర్య వాస్తవం దినపత్రికలోని మరిన్ని వార్తల కోసం సంప్రదించండి


# ఉధృతంగా వరద గోదావరి

- భద్రాచలం వద్ద 35.40 అడుగులు దాటిన ప్రవాహం
- గుండేటి, ఎద్దు వాగుల కాజ్‌వేలపైకి చేరిన వరద నీరు
- 32 గిరిజన గ్రామాలకు నిలిచిన రాకపోకలు

భద్రాచలం-సూర్య వాస్తవం, జూలై 26



ఎగువ ప్రాంతాల నుంచి వస్తోన్న వరద నీటితోపాటు తెలంగాణలో కురుస్తోన్న వర్షాలకు భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం క్రమంగా పెరుగుతోంది. శనివారం రాత్రి ఎనిమిది గంటలకు నీటిమట్టం 35.40 అడుగులు దాటి ప్రవహిస్తోంది. ఆరు లక్షల క్యూసెక్కులకుపైగా వరద ప్రవాహం కొనసాగుతోంది. ఏలూరు జిల్లా కుక్కునూరు మండలంలో కుక్కునూరు-దాచారం మధ్య గుండేటి వాగు కాజ్‌వే నీట మునిగింది. దీంతో, దాచారం, బెస్తగూడెం, సీతారామపురం, నెమలిపేట, ఉప్పర మద్దిగట్ల, అరవపల్లి, గొమ్ముగూడెం, లచ్చిగూడెం తదితర 12 గిరిజన గ్రామాలకు రాకపోకలు నిల్చిపోయాయి. వేలేరుపాడు మండలంలో కొయిదా వెళ్లే మార్గంలో పోలవరం ప్రాజెక్ట్ బ్యాక్

- మిగతా 2లో..

### ఢిల్లీలో సిద్ధరామయ్య, డీకే శివకుమార్

# ఓఎస్డీల పరస్పర దాడి

(మొదటిపేజీ తరువాయి)

భంగం కలిగించారని, అందుకే అతడిపై చర్యలు తీసుకోవాలని అధికారులకు ఫిర్యాదు చేశారు. మోహన్ కుమార్ గతంలోనూ పలువురు ఉన్నతాధికారులతో దురుసుగా ప్రవర్తించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ విషయం తన దృష్టికి వచ్చిందని రెసిడెంట్ కమిషనర్ ఇమ్‌కోంగ్ల జమీర్ వెల్లడించారు. ఆంజనేయనే తనతో దురుసుగా ప్రవర్తించారని సీఎం ఓఎస్డీ మోహన్ కుమార్ ఆరోపిస్తున్నారు. ఆయనే తన ఛాంబర్‌లోకి వచ్చి బెదిరింపులకు పాల్పడ్డారని తెలిపారు. అయితే ఈ ఘర్షణకు సంబంధించిన సీసీటీవీ ఫుటేజీని కార్యాలయంలోని ఔట్ సోర్సింగ్ సిబ్బంది తొలగించినట్లుగా తెలుస్తోంది. ఇరువురు అధికారుల మధ్య జరిగిన ఘర్షణ అంశం తన దృష్టికి రాలేదని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య తెలిపారు. ఏం జరిగిందో పూర్తి వివరాలు తెలుసుకున్నాక మాట్లాడుతానని తెలిపారు.

# గోవా గవర్నరుగా అశోక్ గజపతిరాజు ప్రమాణ స్వీకారం

(మొదటిపేజీ తరువాయి)

కూడా మంత్రి లోకేష్ సత్కరించారు. అశోక్ గజపతిరాజు విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించారు. రాజకీయవేత్తగా ఆయనకు వివాదరహితుడిగా పేరుంది. గతంలో ఏడు సార్లు ఎమ్మెల్యేగా విజయం సాధించారు. 2014లో విజయనగరం ఎంపిగా గెలుపొందారు. మోడీ కేబి నెట్‌లో విమానయానశాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించారు. మహారాజా అలక్‌నారాయణ విద్యా సంస్థలను అశోక్ గజపతిరాజు నిర్వహిస్తున్నారు. మాన్సాస్ ట్రస్ట్ ఛైర్మన్‌గా బాధ్యతలు నిర్వహించారు. గతంలో ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షులుగా కూడా అశోక్ గజపతిరాజు ఉన్నారు. ఎన్‌టిఆర్, చంద్రబాబు కేబినెట్‌లలో కీలక మంత్రిత్వశాఖలను చేపట్టారు.

# తలసరి ఆదాయంలో దేశంలోనే కర్ణాటక నంబర్ వన్

(మొదటిపేజీ తరువాయి)

ప్రభుత్వ సాధన సమావేశంలో లక్షలాది మంది లబ్ధిదారులు ప్రభుత్వాన్ని అభినందిస్తున్నారు. అభివృద్ధి ప్రాజెక్టులకు రూ. 1.20 లక్షల కోట్లు ఖర్చు చేయడంతో పాటు, హామీ ప్రాజెక్టులకు రూ.56 వేల కోట్లు ఖర్చు చేసి, అభివృద్ధి పనులను ప్రజల ముంగిటకు చేర్చాము. సామాజిక న్యాయం మరియు పేదల పురోగతి కోసం, రాజ్యాంగ విలువలను నెరవేర్చడం కోసం కార్యక్రమాలను రూపొందించి అమలు చేసే ఏకైక పార్టీ కాంగ్రెస్. దేశంలో, రాష్ట్రంలో సామాజిక న్యాయ పనులను అమలు చేసిన ఏకైక పార్టీ మా పార్టీ అని ఆయన అన్నారు. ఢిల్లీలో జరిగిన వెనుకబడిన తరగతుల నాయకుల సమావేశంలో, రాహుల్ గాంధీ వెనుకబడిన వర్గాల పట్ల తనకున్న అవగాహనను స్పష్టం చేశారు. ప్రభుత్వం వెనుకబడిన తరగతులు, మహిళలు, దళితులు, దోపిడీకి గురైనవారు అన్ని కులాల పేదల జీవితాల కోసం కార్యక్రమాలను రూపొందించిందని ఆయన అన్నారు.

శివలింగేగౌడకు రాజకీయ భవిష్యత్తు ఉంది. మంత్రి కావడానికి ఆయనకు అన్ని అర్హతలు ఉన్నాయి. అంతే కాకుండా, నియోజకవర్గ ప్రజల ఆశీస్సులు కూడా బలంగా ఉన్నాయి. అందుకే నాలుగుసార్లు గెలిచిన శివలింగేగౌడ తదుపరిసారి కూడా గెలుస్తాడు. కానీ కొన్ని రాజకీయ విషయాలను బహిరంగంగా చర్చించలేమని ఆయన అన్నారు.

# ఏపీ డీఎస్పీల మృతి

(మొదటిపేజీ తరువాయి)



ఇద్దరు డీఎస్పీలు మృతి చెందడం దిగ్భ్రాంతికి గురిచేసింది. వారిని మేకా చక్రధర్ రావు, కాంతారావుగా గుర్తించారు. ఈ ప్రమాదంలో ఏఎస్పీ కోకా రామ్ ప్రసాద్, డ్రైవర్ నర్సింగరావు తీవ్రంగా గాయపడ్డారు. ఏఎస్పీ రామ్ ప్రసాద్ సీట్ బెల్టు పెట్టుకోవడంతో ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నట్టు తెలుస్తోంది. అయినప్పటికీ ఆయన కాలు విరిగింది. పక్కటెముకలకు బలమైన దెబ్బలు తగిలాయి. డ్రైవర్ నర్సింగరావుకు భుజం ఎముక తొలగినట్టు తెలుస్తోంది. కాగా, వారు ప్రయాణిస్తున్న స్కార్పియో వాహనం డివైడర్‌ను బలంగా ఢీకొన్నట్టు విజువల్స్ చెబుతున్నాయి. ఈ రోడ్డు ప్రమాదానికి సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో దర్శనమిస్తోంది. గత నెలలోనూ ఏపీకి చెందని ఓ ఎస్సై, కానిస్టేబుల్ తెలంగాణ వెళుతూ రోడ్డు ప్రమాదంలో మరణించడం తెలిసిందే. కొన్ని వారాల వ్యవధిలోనే మరో యాక్సిడెంట్ ఘటన జరగడంతో ఏపీ పోలీసు వర్గాల్లో విషాదం నెలకొంది.

# సింగపూర్ పర్యటనకు సీఎం చంద్రబాబు

(మొదటిపేజీ తరువాయి)

తెలుగు పారిశ్రామికవేత్తలు హాజరుకానున్నారు. ఫిలిప్పీన్స్, థాయ్ లాండ్ నుంచి కూడా వివిధ కంపెనీల ప్రతినిధులు హాజరుకానున్నారు. ఏపీ ఎన్ఆర్టీ ఆధ్వర్యంలో జరిగే ఈ సమావేశానికి 1,500 మంది ప్రతినిధులు హాజరుకానున్నారు. ఈ భారీ సదస్సుకు సింగపూర్ లోని వన్ వరల్డ్ ఇంటర్నేషనల్ స్కూల్ లో ఏర్పాట్లు చకచకా జరుగుతున్నాయి. ఏపీ నిరుద్యోగ యువతకు దేశంలోనే కాకుండా వివిధ దేశాల్లో ఉద్యోగ అవకాశాలపై ఈ సదస్సులో చర్చించనున్నారు. వివిధ దేశాల తెలుగు వారిని ఏపీ అభివృద్ధిలో భాగస్వాములను చేయడంపై చర్చించనున్నారు. కూటమి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన పీ4 కార్యాచరణలో భాగస్వాములు కావాలని తెలుగు పారిశ్రామికవేత్తలు, ఎన్ఆర్ఐలను సీఎం చంద్రబాబు కోరనున్నారు. పలు దేశాలకు ఏపీ నుంచి ఎగుమతులు పెంచడానికి ఎన్నారైల ద్వారా ప్రణాళికలపై చర్చించనున్నారు. స్కిల్ డెవలప్ మెంట్ కార్యక్రమాల ద్వారా యువతకు ఉద్యోగ అవకాశాలపై చర్చించనున్నారు. సీఎం చంద్రబాబు బృందం సింగపూర్ పర్యటనలో భాగంగా... స్పోర్ట్స్, పోర్ట్స్ సహా వివిధ మౌలిక సదుపాయాలు, లాజిస్టిక్ కేంద్రాలను సందర్శించనున్నారు.

# ఉధృతంగా వరద గోదావరి

(మొదటిపేజీ తరువాయి)

వాటర్ ప్రభావంతో బోళ్లపల్లి వద్ద ఉన్న ఎద్దు వాగుపై కాజ్‌వే నీట మునిగింది. దీంతో, ఎడవల్లి, టేకూరు, కాకిసినూరు, కోయిదా, కట్కూరు, తాళ్లగొంది, పూచిగొంది తదితర సుమారు 20 గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి. పోలవరం ప్రాజెక్టు ఎగువన గోదావరి నీటిమట్టం పెరిగింది. ప్రాజెక్టులోకి అదనంగా వస్తోన్న 5,52,343 క్యూసెక్కుల నీటిని స్పిల్ వే 48 గేట్ల నుండి దిగువకు విడుదల చేస్తున్నారు. స్పిల్ వే ఎగువన 30.400 మీటర్లు, దిగువన 20.850 మీటర్లు, ఎగువ కాఫర్ డ్యామ్ ఎగువన 30.700 మీటర్లు, దిగువ కాఫర్ డ్యామ్ దిగువన 20.600 మీటర్లు, ఎగువ, దిగువ కాఫర్ డ్యాముల మధ్య 15.880 మీటర్లు నీటిమట్టం నమోదైనట్లు అధికారులు తెలిపారు. ప్రస్తుతం పోలవరం వద్ద 9.40 మీటర్ల నీటిమట్టం నమోదైనట్లు సిడబ్ల్యుసి అధికారులు చెప్పారు.

పట్టిసీమ శివక్షేత్రం చుట్టూ ఉన్న ఇసుక తిన్నెలు నీట మునిగాయి. వరద పెరుగుతుండడంతో శిఖరం వరకూ మునిగిన గండి పోచమ్మ ఆలయం అల్లూరి జిల్లాలోని పోలవరం ముంపు మండలాలైన విఆర్.పురం, కూనవరం, ఎటపాక, చింతూరు ప్రజలు తీవ్ర భయాందోళనలు చెందుతున్నారు. విఆర్.పురం మండలం వడ్డిగూడెం, వడ్డిగూడెం కాలనీ, ధర్మతాళ్లగూడెం ప్రాంతాల వాసులు ఎత్తు ప్రాంతంలోని రేఖపల్లికి వచ్చి గుడారాలు ఏర్పాటు చేసుకున్నారు. శ్రీరామగిరి వాసులు గుట్టలపై పాకలు వేసు కుంటున్నారు. చింతూరు ఐటిడిఏ అధికారులు అప్రమత్తమయ్యారు. సహాయక చర్యల కోసం లాంచీలు, పడవలను సిద్ధం చేశారు. లోతట్టు ప్రాంతాల వాసులు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిస్తున్నారు. దేవీపట్నం మండలం గొందూరు గ్రామంలోని గండి పోచమ్మ అమ్మవారి ఆలయం గోదావరి వరద ఉధృతికి శిఖరం వరకూ మునిగిపోయింది. ఆలయానికి యాత్రికులు రావొద్దని దేవాలయ అధికారులు సూచించారు. విఆర్.పురం మండలంలోని వాగులు, వంకలు పొంగుతున్నాయి. కూనవరం మండలంలోని కొండరాజు పేట నుంచి టేకులబోరుకు వెళ్లే రోడ్డుపైకి నీరు చేరింది.

**కాటన్ బ్యారేజీ నుంచి 3.60 లక్షల క్యూసెక్కుల విడుదల**

ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ వద్ద ఎనిమిది అడుగుల నీటిమట్టం నమోదైంది. సీలేరు నుంచి 3,901 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. ఈ జలాలతో కలిసి 3,60,011 క్యూసెక్కుల నీరు కాటన్ బ్యారేజీకి వస్తోంది. మరో రెండు మూడు రోజులపాటు ఇదే ప్రవాహం ఉంటుందని ఇరిగేషన్ అధికారులు అంచనా వేస్తున్నారు.

బ్యారేజీ 175 గేట్లను పైకిలేపి 3.60 లక్షల క్యూసెక్కుల నీటిని సముద్రంలోకి విడిచి పెడుతున్నారు. పంటలు, తాగునీటి అవసరాల నిమిత్తం తూర్పు డెల్టా కాలువకు 2,200 క్యూసెక్కులు, సెంట్రల్ డెల్టాకు 2,100 క్యూసెక్కులు, పశ్చిమ డెల్టాకు 3,700 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

**విపత్తుల నిర్వహణ సంస్థ అప్రమత్తం**

గోదావరికి వరద వస్తుండడంతో విపత్తుల నిర్వహణ సంస్థ అప్రమత్తమైంది. ముందస్తుగా వరద ప్రభావం చూపే అల్లూరి సీతారామరాజు, తూర్పుగోదావరి, అంబేద్కర్ కోనసీమ, కాకినాడ, ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాల్లోని మండల అధికారులను అప్రమత్తం చేసినట్లు ఆ సంస్థ ఎమ్‌డి ప్రఖర్‌జైన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఎప్పటికప్పుడు వరద ప్రవాహాన్ని పర్యవేక్షిస్తూ అధికారులు తీసుకోవాల్సిన చర్యలపై సూచలిస్తున్నట్లు పేర్కొన్నారు. తుంగభద్ర వద్ద 40 వేల క్యూసెక్కుల వరద ప్రవాహం ఉందని, గోదావరి, కృష్ణా, తుంగభద్ర నదులు వరద ప్రవాహం హెచ్చరిక స్థాయికి చేరనప్పటికీ దిగువకు నీటిని విడుదల చేస్తున్న నేపథ్యంలో ఆయా నదీ పరివాహక ప్రాంతం, లోతట్టు గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బోట్లు, మోటారు బోట్లు, స్టీమర్లతో నదిలో ప్రయాణించడం, వరద నీటిలో ఈతకు వెళ్లడం, చేపలు పట్టడం, స్నానాలకు వెళ్లడం వంటివి చేయరాదని కోరారు.

**నేడు పలు జిల్లాల్లో తేలికపాటి వర్షాలు**

శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, విశాఖపట్నం జిల్లాల్లో ఆదివారం తేలికపాటి వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. శనివారం పాడేరులో 70 మిల్లీమీటర్లు, కర్నూలు జిల్లా కృష్ణగిరిలో 29 మిల్లీమీటర్లు, అల్లూరి జిల్లా ముంచింగిపుట్టులో 24 మిల్లీమీటర్లు, అన్నమయ్య జిల్లా గాలివీడులో 22 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైందని పేర్కొంది.

# విద్యార్థుల ఆత్మహత్యలపై కదిలిపోయిన సుప్రీంకోర్టు..

- నివారణకు సంచలన మార్గదర్శకాలు
- దేశంలోని ప్రతి 100 ఆత్మహత్యలలో 8 మంది విద్యార్థులు
- ఆత్మహత్యల నివారణకు 15 సమగ్ర మార్గదర్శకాలు విడుదల చేసిన సుప్రీంకోర్టు
- ఎన్‌సీఆర్బీ 2022 డేటా ఆధారంగా జారీ
- విశాఖపట్నంలో 'నీట్' విద్యార్థి ఆత్మహత్యపై సీబీఐ దర్యాప్తునకు ఆదేశం

న్యూఢిల్లీ– సూర్య వాస్తవం, జూలై 26

దేశంలోని విద్యా సంస్థల్లో ఆందోళనకరంగా పెరుగుతున్న విద్యార్థుల ఆత్మహత్యలను అరికట్టేందుకు సుప్రీంకోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. దేశవ్యాప్తంగా విద్యార్థులకు మానసిక ఆరోగ్యం, మద్దతు అందిం చేందుకు ఉద్దేశించిన 15 సమగ్ర మార్గదర్శ కాలను సర్వోన్నత న్యాయస్థానం తాజాగా జారీ చేసింది. ఈ మార్గదర్శకాలు స్కూళ్లు, కళాశాలలు, కోచింగ్ సెంటర్లు, విశ్వవిద్యాలయాలు, శిక్షణ అకాడమీలు, హాస్టళ్లు సహా అన్ని విద్యా సంస్థలకూ వర్తిస్తాయి. విద్యా ఒత్తిడి, పరీక్షల భయం, సంస్థాగత మద్దతు లోపం వల్లే విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని కోర్టు తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది.

**తప్పనిసరి మానసిక ఆరోగ్య కౌన్సెలింగ్**

"విద్యా సంస్థల్లో తప్పనిసరి మానసిక ఆరోగ్య కౌన్సెలింగ్, ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థలు, నియంత్రణ పర్యవేక్షణ ఏర్పాటు చేయాలి" అని సుప్రీంకోర్టులోని జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతా బెంచ్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ముఖ్యంగా "పరీక్షల సమయంలో, విద్యా సంవత్సరం మార్పు సమయంలో చిన్న బ్యాచ్‌లకు ప్రత్యేక కౌన్సెలర్లు లేదా మెంటార్లను నియమించాలి. వారు గోప్యంగా మద్దతును అందించాలి" అని కోర్టు ఉద్ఘాటించింది.

**కీలక మార్గదర్శకాల వివరాలు:**

సుప్రీంకోర్టు జారీ చేసిన 15 మార్గదర్శకాలలో ముఖ్యమైనవి:

మానసిక ఆరోగ్య శిక్షణ: బోధన, బోధనేతర సిబ్బంది అందరూ సంవత్సరానికి రెండుసార్లు తప్పనిసరి మానసిక ఆరోగ్య శిక్షణ పొందాలి. ఈ శిక్షణలో మానసిక సహాయం, ఒత్తిడి సంకేతాల గుర్తింపు, స్వీయ–హాని సందర్భాల్లో స్పందన, సరైన సహాయానికి రిఫరల్ ప్రక్రియలపై దృష్టి ఉంటుంది.

వివక్ష రహిత విధానం: విద్యార్థులతో సున్నితంగా, సమగ్రంగా వ్యవహరించేలా సిబ్బందికి ప్రత్యేక శిక్షణ ఇవ్వాలి.

**ఫిర్యాదుల కమిటీ:** లైంగిక వేధింపులు, ర్యాగింగ్, ఇతర ఫిర్యాదులను పరిష్కరించేందుకు అంతర్గత కమిటీలు ఏర్పాటు చేయాలి. బాధిత విద్యార్థులకు తక్షణమే మానసిక–సామాజిక మద్దతు అందించాలి.

సెన్సిటైజేషన్ కార్యక్రమాలు: తల్లిదండ్రులకు మానసిక ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమాలు, విద్యార్థులకు మానసిక ఆరోగ్య సాక్షరత, భావోద్వేగ నియంత్రణ, జీవన నైపుణ్యాలను విద్యా కార్యకలాపాల్లో భాగంగా చేర్చాలి.

సూసైడ్ హెల్ప్‌లైన్: టెలి–మానస్ వంటి జాతీయ సూసైడ్ హెల్ప్‌లైన్ నంబర్లను హాస్టళ్లు, తరగతి గదులు, సాధారణ ప్రాంతాలు, వెబ్‌సైట్లలో పెద్ద అక్షరాలతో స్పష్టంగా ప్రదర్శించాలి.

వెల్‌నెస్ రికార్డులు: విద్యార్థుల మానసిక ఆరోగ్య రికార్డులను అత్యంత గోప్యంగా నిర్వహించాలి.

ఎన్‌సీఆర్బీ డేటా ఆధారంగా..

ఈ మార్గదర్శకాలు నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో (ఎన్‌సీఆర్బీ) 2022 డేటా ఆధారంగా జారీ చేయబడ్డాయి. 2022లో దేశవ్యాప్తంగా నమోదైన 1,70,924 ఆత్మహత్యలలో 13,044 విద్యార్థులవి. అంటే ప్రతి 100 ఆత్మహత్యలలో 8 మంది విద్యార్థులు ఉన్నారని ఎన్సీఆర్బీ నివేదించింది. 2001లో ఈ సంఖ్య 5,425గా ఉండగా, 2022లో 2,248 మంది విద్యార్థులు పరీక్షలలో విఫలమైన కారణంగా ఆత్మహత్య చేసుకున్నారు. ఈ గణాంకాలు విద్యా సంస్థల్లో ఉన్న సిస్టమాటిక్ లోపాలను స్పష్టంగా సూచిస్తున్నాయని కోర్టు పేర్కొంది.

ఆంధ్రప్రదేశ్ కేసు నేపథ్యం

ఈ చారిత్రాత్మక తీర్పు ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నంలో 'నీట్'కు సిద్ధమవుతున్న 17 ఏళ్ల విద్యార్థిని 2023 జూలై 14న ఆత్మహత్య చేసుకున్న కేసు సందర్భంగా వెలువడింది. ఆమె తండ్రి సీబీఐ దర్యాప్తు కోరగా ఆంధ్రప్రదేశ్ హైకోర్టు 2024 ఫిబ్రవరి 14న ఆ దరఖాస్తును తిరస్కరించింది. దీనిపై సుప్రీంకోర్టును ఆశ్రయించిన తండ్రి ఫిర్యాదుతో కోర్టు ఇప్పుడు సీబీఐ దర్యాప్తుకు ఆదేశించింది.

సుప్రీంకోర్టు రాజ్యాంగంలోని ఆర్టికల్ 32 , 141 ప్రకారం ఈ మార్గదర్శకాలను జారీ చేసింది. పార్లమెంటు లేదా రాష్ట్ర శాసనసభలు తగిన చట్టం రూపొందించే వరకు ఇవి చట్టంగా అమలులో ఉంటాయి. ఈ మార్గదర్శకాలు, సుప్రీంకోర్టు మాజీ జడ్జి జస్టిస్ రవీంద్ర ఎస్ భట్ నేతృత్వంలోని విద్యార్థుల మానసిక ఆరోగ్య జాతీయ టాస్క్ ఫోర్స్ పనిని మరింత బలపరుస్తాయని కోర్టు తెలిపింది.

# మాల్దీవులుతో సంబంధాల పెంపునకు ఆసక్తి

(మొదటిపేజీ తరువాయి)

సహా పలువురు నేతలతో శనివారం మోడీ భేటీ అయ్యారు. ఇరు దేశాల మధ్య సంబంధాలకు సంబంధించిన కీలకమైన అంశాలపై లతీఫ్, మోడీ చర్చలు జరిపారు. మౌలిక వసతులు, సాంకేతికత, వాతావరణ మార్పులు, ఇంధనం సహా పలు కీలక రంగాల్లో కలిసి పనిచేయడం కొనసాగించాలని నిర్ణయించినట్లు మోడీ పేర్కొన్నారు. ఈ మేరకు ఎక్స్‌లో పోస్టు పెట్టారు. ఈ సన్నిహిత సహకారం ఇరు దేశాలకూ లాభదాయకంగా వుంటుందన్నారు. ఈ భాగస్వామ్యం ఇంకా పెరగాలని కోరుకుంటున్నట్లు చెప్పారు. ఇరు దేశాల పార్లమెంట్‌ల మధ్య గల సన్నిహిత సంబంధాలతో పాటూ స్నేహ బంధం గురించి కూడా అందరం మాట్లాడుకున్నట్లు తెలిపారు. మాల్దీవులు సామర్థ్యాల పెంపునకు, నిర్మాణానికి మద్దతునివ్వడానికి భారత్ కట్టుబడి వుందని మోడీ చెప్పారు.

# టీఆర్ఎఫ్‌ను ఉగ్రసంస్థగా ప్రకటించిన అమెరికా..


**అమెరికా– సూర్య వాస్తవం, జూలై 26**

పహల్గామ్ ఉగ్రదాడికి పాల్పడిన పాకిస్థాన్ కేంద్రంగా పనిచేసే నిషేధిత ఉగ్రసంస్థ, లష్కరే తోయిబా అనుబంధ సంస్థ అయిన ది రెసిస్టెన్స్ ఫ్రంట్ (టీఆర్ఎఫ్)ను ఇటీవల అమెరికా ఉగ్రవాద సంస్థగా ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే, అగ్రరాజ్యం నిర్ణయంపై తాజాగా పాకిస్థాన్ స్పందించింది. టీఆర్ఎఫ్‌ను ఉగ్రసంస్థగా ప్రకటించడంపై తమకు ఎలాంటి అభ్యంతరం లేదని తెలిపింది. ఈ మేరకు ఆ దేశ విదేశాంగ మంత్రి ఇషాక్ దార్ వెల్లడించారు. అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రుబియోతో నిన్న ఇషాక్ దార్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో పాక్ మంత్రి మాట్లాడుతూ.. 'టీఆర్ఎఫ్‌ను ఉగ్రసంస్థగా ప్రకటించే సార్వభౌమాధికారం అమెరికాకు ఉంది. యూఎస్ నిర్ణయంతో మాకు ఎలాంటి సమస్య లేదు. వారి ప్రమేయం ఉందని ఆధారాలు ఉంటే అలా చేయొచ్చు. మేము స్వాగతిస్తాము' అని వాషింగ్టన్ డీసీలో జరిగిన ఓ కార్యక్రమంలో ఇషాక్ దార్ తెలిపారు. అయితే, టీఆర్ఎఫ్‌కు లష్కరే తోయిబాకు ముడిపెట్టడం మాత్రం తప్పని ఆయన పేర్కొన్నారు. ఆ సంస్థను తాము కొన్నేళ్ల క్రితమే కూల్చేశామన్నారు.కాగా, ఏప్రిల్ 22న జమ్మూకాశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రవాదులు నరమేధం సృష్టించిన విషయం తెలిసిందే. బైసరాన్ వ్యాలీలో పర్యాటకులే లక్ష్యంగా విచక్షణా రహితంగా కాల్పులకు తెగబడ్డారు. ఈ ఘటనలో 26 మంది అమాయకులు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటన దేశం మొత్తాన్ని తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది.

మొదట ఈ మారణహోమానికి తామే బాధ్యులమని టీఆర్ఎఫ్ ప్రకటించుకుంది. కానీ, ఆ తర్వాత మాట మార్చేసింది. ఇక, ఈ దాడి తర్వాత టీఆర్ఎఫ్‌ను అమెరికా అంతర్జాతీయ ఉగ్రవాద సంస్థగా ప్రకటించింది. అటు, 2023 జనవరిలో చట్టవిరుద్ధ కార్యకలాపాల (నివారణ) చట్టం కింద భారత్ కూడా టీఆర్ఎఫ్‌ను ఉగ్రవాద సంస్థగా ప్రకటించిన విషయం తెలిసిందే.

# సంపాదకీయం

## తప్పుకున్నారా... తప్పించారా...




భారత ఉపరాష్ట్ర పదవి ఎవరిని వరిస్తుందని విషయం ప్రస్తుతం చర్చనీయాంశమైంది. ఆరోగ్య కారణాలతో జగదీష్ ధన్కడ్ రాజీనామా చేయడం, ఆమోదించడంతో ఉపరాష్ట్రపతి ఎన్నిక అనివార్యం అయ్యింది. అందుకు సంబంధించినోటిఫికేషన్ జారీ చేసింది.రెండు నెలల్లో ఈ ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉందిభారత దేశంలో ప్రథమ పౌరుడు రాష్ట్రపతి.. అధికారాలు పరిమితంగా ఉన్నా.. హోదా ఉన్నతమైనది. తర్వాత ఉపరాష్ట్రపతికి కూడా అంతే విలువ ఉంటుంది. ఇంతటి ప్రాధాన్యం కలిగిన పదవికి జగదీప్ ధన్ఖడ్ రాజీనామా చేశారు. . ఈ నిర్ణయం ఆయన వ్యక్తిగత ఆరోగ్య పరిస్థితులపై ఆధారపడినప్పటికీ, దీని వెనుక రాజకీయ ఒత్తిడి ఉండవచ్చనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ధన్ఖడ్ రాజీనామా భారత రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.ధన్ఖడ్ రాజీనామాపై రాజకీయ ఒత్తిడి ఆరోపణలు ఉన్నప్పటికీ, ఇవి ప్రస్తుతం ఊహాగానాల స్థాయిలోనే ఉన్నాయి. ఉపరాష్ట్రపతి పదవి రాజ్యాంగబద్ధమైనది, రాజకీయ పక్షపాతం నుంచి దూరంగా ఉండాల్సిన బాధ్యత కలిగినది. అయినప్పటికీ, రాజకీయ నాయకులు, విశ్లేషకులు ఈ రాజీనామా వెనుక రాజకీయ కోణాన్ని పరిశీలిస్తున్నారు. ధన్ఖడ్ రాజస్థాన్‌కు చెందిన ప్రముఖ నాయకుడు, రైతు నేపథ్యం నుండి వచ్చిన వ్యక్తి కావడం వల్ల, ఆయన రాజీనామా రాజకీయ వర్గాల్లో విస్తృత చర్చకు దారితీసింది.భారత రాజ్యాంగం ప్రకారం, ఉపరాష్ట్రపతి తన రాజీనామాను రాష్ట్రపతికి సమర్పించవచ్చు. ఈ ప్రక్రియ సాధారణంగా అధికారికంగా జరుగుతుంది, కానీ రాజీనామా కారణాలు రాజకీయంగా సున్నితమైనవిగా ఉంటే, అవి విస్తృత చర్చకు దారితీస్తాయి. ధన్ఖడ్ రాజీనామా వెనుక అనారోగ్యం ప్రధాన కారణంగా చెప్పబడినప్పటికీ, రాజకీయ ఒత్తిడి ఆరోపణలు ఈ నిర్ణయం యొక్క పారదర్శకతపై ప్రశ్నలను లేవనెత్తుతున్నాయి.భారత ఉపరాష్ట్రపతి పదవి నుంచి రాజీనామా చేసిన సందర్భాలు చాలా అరుదు. చరిత్రలో ఒకే ఒక్క ఉదాహరణ మాత్రమే గుర్తించదగినది:వీవీ.గిరి, రాష్ట్రపతి ఎన్నికల్లో పోటీ చేసేందుకు 1969లో ఉపరాష్ట్రపతి పదవికి రాజీనామా చేశారు. ఆయన ఆ తర్వాత రాష్ట్రపతిగా ఎన్నికయ్యారు. ఈ రాజీనామా రాజకీయ లక్ష్యాల కోసం జరిగినప్పటికీ, అనారోగ్య కారణాలతో రాజీనామా చేసిన సందర్భాలు గతంలో లేవు.జగదీప్ ధన్కర్ రాజీనామా ఒక అరుదైన సంఘటన, ఇది భారత రాజకీయ చరిత్రలో ముఖ్యమైన సంఘటనగా నిలిచిపోతుంది. గతంలో వి.వి. గిరి రాజీనామాతో పోలిస్తే, ఈ రాజీనామా భిన్నమైన సందర్భంలో జరిగినప్పటికీ, ఈ విషయంపై మరింత స్పష్టత కోసం అధికారిక ప్రకటనలు, విశ్వసనీయ ఆధారాలపై ఆధారపడటం అవసరం.ఎవరైనా మధ్యలో ఉపరాష్ట్రపతి పదవికి రాజీనామా చేసి వెళ్లిపోతే ఆ స్థానంలో వేరే వాళ్లు వచ్చే అవకాశం ఉందా? ఇప్పుడు ఇదే ప్రశ్న అందరిలో తొలుస్తుంది. అయితే దీనికి సమాధానం ఏంటంటే.. ఉపరాష్ట్రపతి రాజీనామా చేసిన వెంటనే డిప్యూటీ చైర్మన్ ఆయన స్థానంలో పనిచేస్తారు. ఉపరాష్ట్రపతి ప్రధానమైన డ్యూటీ ఏంటంటే రాజ్యసభ్‌కు చైర్మన్‌గా ఉండటం. అలాగే ఇక్క డిప్యూటీ చైర్మన్‌లు కూడా ఉంటారు. కాబట్టి ఉపరాష్ట్రపతి స్థానంలో ప్రస్తుతానికి డిప్యూటీ చైర్మన్ బాధ్యతలు నిర్వహిస్తారు. ఇక ఆయనే రాజ్యసభ కార్యకలాపాలకు అధ్యక్షత వహిస్తారు. సమావేశాలు నిర్వహిస్తారు. అయితే డిప్యూటీ చైర్మన్ కూడా లేకపోతే రాజ్యసభ్యులు ఎవరైనా వైస్ చైర్మన్ల ప్యానెల్‌లో సీనియర్ సభ్యుడ్ని ఎన్నుకోవచ్చు. అతన్ని తాత్కాలిక చైర్మన్‌ని చేసి బాధ్యతలు అప్పటించవచ్చు. ఉపరాష్ట్రపతి ఎన్నికకు సంబంధించి ప్రస్తుతం ఢిల్లీలో హైడ్రామా నడుస్తోంది. అయితే ఈ ఎన్నికల్లో తమ ప్రాబల్యం చాటుకునేందుకు, ఈ ఎన్నికలను అవకాశంగా చేసుకొని బీజేపీ నాయకత్వంలోని ఎన్డీఏ ను ఇరకాటంలో పెట్టేందుకు కాంగ్రెస్ ప్రయత్నాలు మొదలయ్యాయి. ఉపరాష్ట్రపతి పదవికి అర్హులైన వారిని ఎంపిక చేయడం విషయంలో ఉభయ సభల్లో మెజార్టీ స్థానాలు ఉన్న ఎన్డీఏ ఒక అభ్యర్థిని పోటీలో నిలుపుతారు. ఈ విషయంలో మిగతా పార్టీలు అభ్యంతరాలు వ్యక్తం చేయడం ఆశ్చర్యానికి గురిచేస్తుంది. తెలంగాణ ప్రాంతానికి చెందిన బీజేపీ సీనియర్ నేత బండారు దత్తాత్రేయ పేరును ఉపరాష్ట్రపతి పదవికి ప్రతిపాదించే విషయంలో కాంగ్రెస్ హైకమాండ్ ను ఒప్పించే విషయంలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కృతకృత్యులయ్యారు. అయితే కాంగ్రెస్ చేస్తున్న ప్రతిపాదనను బీజేపీ పరిగణలోకి తీసుకోవడం, తీసుకోకపోవడం ఆ పార్టీ స్ట్రాటజీపై ఆధారపడి ఉంటది.ఎలక్ట రోల్ కాలేజీలో మెజార్టీ స్థానాలు ఉన్న బీజేపీ ప్రతిపాదించే నాయకుడే ఉపరాష్ట్రపతి పీఠం అధిష్టించేందుకు అవకాశాలు ఉన్నాయి.ఎన్డీఏ కు స్పష్టమైన మెజార్టీ ఉండడంతో బీజేపీ ఈ విషయంలో ఎవరిని రంగంలోకి దింపుతారనేది ప్రస్తుతం చర్చనీయాంశమైంది. బీహార్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ఆ ప్రాంతానికి చెందిన ఉపరాష్ట్రపతి పదవికి అభ్యర్థిగా బీజేపీ ఎంపిక చేయవచ్చని కూడా భావిస్తున్నారు. మిత్ర పక్షానికి చెందిన జనతాదళ్ కు చెందిన వారిని ఎన్నుకోవచ్చని, మహిళలకు ప్రాతినిధ్యం కల్పించామని చెప్పుకునేందుకు నిర్మల సీతా రామన్, పురంధరేశ్వరి పేర్లు ప్రతిపాదనకు రావచ్చని భావిస్తున్నారు. బీజేపీ చివరికి ఎవరిని ప్రతిపాదిస్తారో వేచిచూడాల్సిందే..

# లిక్కర్ స్కాం...రంగంలోకి ఈడీ





**నెల్లూరు – సూర్య వాస్తవం**

సిట్ దర్యాప్తు నడుస్తూనే ఉంది. ఇప్పటి వరకు 12 మంది అరెస్ట్ అయ్యారు. ఏకంగా ఓ ఎంపీ జైలుకెళ్లారు. కనిపించకుండా పోయిన ఆ తొమ్మిది మందిని రప్పించే స్కెచ్ వేస్తున్నారు. నెక్స్ట్ ఓ పెద్ద నేత వంతు రావడం పక్కా అంటున్నారు. సరిగ్గా ఇదే టైమ్‌లో ఈడీ ఎంటర్ అయింది. దీంతో ఏపీ లిక్కర్ కేసు మరింత పీక్ లెవల్‌కు చేరుకుంది. ముడుపుల వ్యవహారంపై కూపీ లాగేందుకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ రంగంలోకి దిగడంతో..వేడి రాజుకుంటోంది. ఏపీ లిక్కర్ కేసు ఇంకా స్ట్రాంగ్ కానుందా.? ఏపీ లిక్కర్ కేసు కీలక మలుపు తిరుగుతోంది. వేల కోట్ల ముడుపులు, విదేశీ లింకులు, హవాలా లావాదేవీలంటూ ఆరోపణలున్న ఈ కేసులో ఇప్పుడు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ రంగంలోకి దిగింది. మరోవైపు కొందరు నిందితులపై రెడ్ కార్నర్ నోటీసులు జారీ చేసింది సిట్. విదేశాలకు వెళ్లిపోయిన వారిని రప్పించేందుకు అవసరమైతే ఇంటర్‌పోల్ హెల్ప్ తీసుకునే ప్లాన్ చేస్తోందట సిట్. కేసులో కీలకమైన 12 మంది అరెస్టు అయ్యారు. 9 మంది కీలక నిందితులు విదేశాలకు వెళ్లిపోయారు.లిక్కర్ స్కామ్‌లో కీ రోల్ ప్లే చేశారని అలిగేషన్స్ ఫేస్ చేస్తున్న ఎంపీ మిథున్‌రెడ్డి అరెస్ట్ అయి రాజమండ్రి జైల్లో ఉన్నారు. ఆయన అరెస్ట్ అయినప్పటి నుంచే బిగ్‌బాస్‌గా చెప్తున్న వ్యక్తి చుట్టూ కూడా ఉచ్చు బిగుస్తోందన్న ప్రచారం మొదలైంది. ఇంకో నెల రోజుల్లోనే అసలు సూత్రధారిగా ఆరోపణలు ఎదుర్కొంటున్న నేతను ఈ కేసులో రౌండప్ చేస్తారని ఇన్ సైడ్ టాక్. సరిగ్గా ఇదే టైమ్‌లో ఈ కేసులో ఈడీ ఎంటర్ అయింది. శర్వాణీ ఆల్కో బ్రూ కంపెనీ డైరెక్టర్ చంద్రారెడ్డిని విచారణకు పిలిచింది.వైసీపీ హయాంలో భారీగా లిక్కర్ ఆర్డర్లు పొందిన కంపెనీల్లో శర్వాణీ సంస్థ ఒకటి అంటున్నారు. ఈ వివరాలను సిట్ చార్జిషీటులో ప్రస్తావించిందట. శర్వాణీ కంపెనీ డైరెక్టర్ చంద్రారెడ్డికి ఎంపీ మిథున్ రెడ్డితో సహా పలువురు వైసీపీ నేతలతో సంబంధాలున్నాయంటున్నారు. సిట్ పలుసార్లు ఆయనకు నోటీసులు ఇచ్చినా విచారణకు రాలేదు. ఇప్పుడు..అదే చంద్రారెడ్డికి ఈడీ నుంచి పిలుపు వచ్చింది. అయితే ఈ స్టేజ్‌లో లిక్కర్ వ్యవహారంలో ఈడీ ఎంటర్ అవడం అతిపెద్ద డెవలప్‌మెంట్‌గా చెప్పొచ్చు.ఇన్నాళ్లు సిట్ దర్యాప్తు సాగుతుండగా, ఈడీ ఎందుకు జోక్యం చేసుకోలేదని టీడీపీ ప్రశ్నిస్తూ వచ్చింది. బీజేపీ వైసీపీ పెద్దలను కాపాడుతోందనే అనుమానాలు వ్యక్తమయ్యాయి. అయితే పీఎంఎల్ ఏ కింద ఇప్పుడు ఈడీ దర్యాప్తు స్టార్ట్ చేయడంతో ఈ అనుమానాలకు తెరపడినట్లయింది. శర్వాణి డిస్టిలరీస్ డైరెక్టర్ చంద్రారెడ్డికి నోటీసులు జారీతో లిక్కర్ వ్యవహారంలో మనీ లాండరింగ్‌పై ఈడీ ఫోకస్ పెట్టింది.ఇప్పటికే లిక్కర్ కేసు ఏపీ పాలిటిక్స్‌ను షేక్ చేస్తోంది. మిథున్‌రెడ్డి అరెస్ట్‌తో వైసీపీలో ఆందోళన ఇంకా ఎక్కువందన్న టాక్ వినిపిస్తోంది. త్వరలోనే ఈ కేసుపై సిట్ పూర్తిస్థాయి చార్జిషీట్ దాఖలు చేయనున్న నేపథ్యంలో..ఈ స్టేజ్‌లో ఈడీ ఎంటర్ అయిందంటే ఈ కేసు మరింత జఠిలంగా మారే అవకాశం కనిపిస్తోంది. సిట్ అలిగేషన్స్ నుంచి తప్పించుకుని బెయిల్ తెచ్చుకున్నా..ఈడీ కేసులు మాత్రం నిందితులకు తలనొప్పిగా మారడం పక్కా. మనీలాండరింగ్ అంటూ ఈడీ కేసు పెడితే నిందితులు మరింత ఇరకాటంలో పడిపోయినట్లే. బెయిల్ దొరకడం కూడా అంత ఈజీ కాదు.ఢిల్లీ లిక్కర్ స్కాంలో ఏం జరిగిందో..నిందితులు బెయిల్ కోసం ఎంత కష్టపడాల్సి వచ్చిందో తెలియనిది కాదు. అయితే అసలు సూత్రధారి అరెస్ట్ ఒక్కటే బాకీ ఉందంటూ ప్రచారం జరుగుతున్న వేళ ఈడీ రాక వైసీపీలో గుబులు పట్టిస్తోందట. వైసీపీ బిగ్‌బాస్‌ను ఈడీ కేసులో ఇరికించే కుట్ర జరుగుతుందన్నది వైసీపీ అనుమానం.ఈడీ దర్యాప్తు స్పీడప్ అయితే..ఈ కేసు ఎవరి టార్గెట్‌గా ముందుకు కదులుతుందనేది మరింత క్లారిటీ రానుంది. ఇప్పటికైతే ఆరోపణలు ఎదుర్కొన్న కీలక వ్యక్తులు అందరూ అరెస్ట్ అయ్యారు. ఇక ఒక్కరిద్దరు మాత్రమే మిగిలి ఉన్నారని అంటున్నారు టీడీపీ నేతలు. మరో నెల రోజుల్లో బ్లాస్టింగ్ న్యూస్ రాబోతుందా? ఈడీ వేట ఎలా ఉండబోతుందనేది చూడాలి.

# పెద్ద ప్రయత్నంలో సీఎం

**విజయవాడ – సూర్య వాస్తవం**



ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు భారీ ఆశలు పెట్టుకున్నారు. ఇప్పుడే నిర్మాణపనులు ప్రారంభమయ్యాయి. ప్రధాని నరేంద్రమోదీ రీ లాంచ్ చేసిన తర్వాత అమరావతి పనులు వేగం అందుకున్నాయి. ఇక ప్రపంచ స్థాయి రాజధానిగా అమరావతిని తీర్చిదిద్దేందుకు చంద్ర బాబు అన్ని రకాలుగా ప్రయత్నిస్తున్నారు. శాశ్వత భవనాల నిర్మాణాన్ని మొదటిదశ పనులను మూడేళ్లలో పూర్తి చేయాలని నిర్ణయించారు. ఇక ఈ లోపు అమరావతికి అవసరమైన సొబగులు అద్దేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నారు. ప్రధానంగా అంతర్జాతీయ ప్రమాణాలతో రాజధాని ఉండేందుకు చంద్రబాబు డ్రీమ్ ప్రాజెక్టుకు వేగంగా అడుగులు పడుతున్నాయి.అందులో భాగంగా అమ రావతిలో అంతర్జాతీయ ఎయిర్ పోర్టు నిర్మాణానికి శ్రీకారం చుట్టనున్నారు. ప్రస్తుతం విజయవాడకు గన్నవరం ఎయిర్ పోర్టు ఉన్నప్పటికీ అంతర్జాతీయ విమానాశ్రయాన్ని అమరావతిలో ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అలాగే అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంను నిర్మించాలని కూడా డిసైడ్ అయ్యారు. ఇందుకోసం మరో నలభై వేల ఎకరాల భూమిని రైతుల నుంచి సేకరించే లక్ష్యంగా అడుగులు పడుతున్నాయి. రైతులతో ప్రభుత్వం చర్చలు జరుపుతుంది. రైతులు కూడా తమ భూములను ల్యాండ్ పూలింగ్ కింద ఇచ్చేందుకు సిద్ధమవుతున్నారు. అదే జరిగితే మొత్తం డెబ్బయి వేలఎకరాల్లో రాజధాని అమరావతి నిర్మాణం జరుగుతుంది. ఇక కేంద్ర ప్రభుత్వ సంస్థలను కూడా అమరావతిలో నెలకొల్పేందుకు ఢిల్లీ పెద్దలతో నిరంతరం టచ్ లో ఉన్నారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వంటి సంస్థలు ముందుకు వస్తే అదనపు ఆకర్షణగా నిలుస్తాయి. ఇక సాఫ్ట్ వేర్ కంపెనీలను కూడా అమరావతికి తీసుకు వచ్చేందుకు చంద్రబాబు తరచూ జాతీయ, అంతర్జాతీయ ప్రముఖులతో సమావేశమవుతున్నారు. అమరావతిలో క్వాంటమ్ వ్యాలీ ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. చేయాల్సిన ప్రయత్నాలన్నింటినీ చంద్రబాబు చేస్తూనే ఉన్నారు. పెట్టుబడుల కోసం రేపు సింగపూర్ కు బయలుదేరి వెళుతున్నారు. అయితే చుట్టుపక్కల ఉన్న హైదరాబాద్, చెన్నై, బెంగళూరు వంటి నగరాలను కాదని అమరావతికి రావాలంటే బిగ్ టాస్క్ అని చెప్పాలి. మరి చంద్రబాబు అటువంటి సమస్య నుంచి అమరావతిని ఎలా ముందుకు తీసుకెళతారన్నది ఆసక్తికరంగా మారింది

# వందనం...అయోమయం

**ఏలూరు– సూర్య వాస్తవం**




తల్లికి వందనం పథకం అనేక మందికి అందలేదు. అనేక కారణాలతో పథకం వారికి అందకపోవడంతో గ్రామ, వార్డు సచివాలయాల చుట్టూ తిరుగుతున్నారు. తల్లికి వందనం పథకం కింద ఏడాదికి పదమూడు వేల రూపాయలు ఒక్కొక్క విద్యార్థికి ప్రభుత్వం ఇస్తున్న నేపథ్యంలో అన్ని అర్హతలున్నా తమకు పథకం నగదుఅందలేదని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. సాంకేతిక కారణాలను చూపి వారికి నగదు జమ చేయలేదు. దీంతో రాష్ట్ర వ్యాప్తగా తల్లికి వందనం కోసం తల్లిదండ్రులు ఎదురుచూస్తున్నారు. తల్లుల ఖాతాల్లోకి తల్లికి వందనం నగదు ఇంకా జమకాక పోవడంతో తల్లిదండ్రులు రాష్ట్ర వ్యాప్తంగా అనేక జిల్లాల్లో ఆందోళన చెందుతున్నారు.

గ్రామ సచివాలయం సిబ్బందికి వెళ్లి ఫిర్యాదు చేసినా తాము ఫిర్యాదును రెయిజ్ చేశామని, కొద్దిరోజులు ఓపిక పట్టాలని సచివాలయ సిబ్బంది చెబుతున్నారు.అయినా సరే తల్లికి వందనం పథకం నగదు జమ కావడంతో ఆలస్యం అవుతుండటంతో విద్యార్థులు తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. కూటమి ప్రభుత్వం ప్రతిష్టత్మకంగా చేపట్టిన సూపర్ సిక్స్ లో ఒకటైన తల్లికి వందనం పథకం ఇంకా కొంతమంది తల్లుల ఖాతాలోకి జమ కాక పోవడాన్ని ప్రశ్నిస్తున్నారు. సచివాలయం దగ్గరికి వెళ్లి తల్లికి వందనం నగదు మాకు జమ కాలేదని అడిగితే కొంతమందికి విద్యుత్తు బిల్లు మూడు వందల యూనిట్లు దాటడం అని చూపిస్తుందని చెబుతున్నారు. అయితే అత్యధికంగా వచ్చిన విద్యుత్తు బిల్లులకు సంబంధించి విద్యుత్తు శాఖ అధికారుల వద్దకు వెళ్లి అడిగితే వారు మాత్రం అక్కడ అప్ డేట్ అయిందని చెబుతున్నారు. తల్లిదండ్రులు కరెంట్ ఆఫీస్ లో క్లియరెన్స్ సర్టిఫికెట్ తీసుకుని మరలా సచివాలయం దగ్గరికి వచ్చి సమర్పించినా కానీ నగదు జమ కావడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఈ విషయంపై సచివాలయంలో ఇంకా నగదు ఎందుకు జమ కాలేదని అడిగితే తాము గ్రీవెన్స్ పెట్టామని, అది అలాగే ఉందని చెబుతున్నారు. విద్యుత్తు శాఖ సిబ్బంది దీనికి సంబంధించిన డేటా ప్రభుత్వానికి ఇంకా అందించారో లేదు తెలియదంటున్నారు. గ్రీవెన్స్ లో మాత్రం కంప్లైంట్ అలాగే ఉండటంతో నగదు జమ కావడం లేదు. దీనిపై ప్రజాప్రతినిధులతో పాటు సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో ఇంటికి వస్తున్న ఎమ్మెల్యేలను నిలదీస్తున్నారు

# వేంకటేశ్వరుడిని దర్శించుకున్న మంత్రి అనిత

**తిరుమల – సూర్య వాస్తవం, జూలై 26**



తిరుమల వేంకటేశ్వరుడిని పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. శనివారం ఉదయం విఐపి విరామ సమయంలో ఎపి హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత , సినీనటి నిరోషా, ఆస్ట్రేలియా కౌన్సిల్ జనరల్ శిలాయ్ జాకి, ప్రభుత్వ విప్ శ్రీధర్‌లు కుటుంబ సభ్యులతో కలసి స్వామివారి సేవలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. దర్శన అనంతరం ఆలయంలోని రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం అందించగా, ఆలయ అధికారులు శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేసి శ్రీవారి శేష వస్త్రంతో సత్కరించారు.

## గిరిజన సంక్షేమ పాఠశాలలు,
# వసతి గృహాల్లో మౌలిక వసతులు కల్పించండి

**- బాల్య వివాహాల నిర్మూలనకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోండి**
**- జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి**



**అన్నమయ్య బ్యూరో- సూర్య వాస్తవం, జూలై 26:** జిల్లాలోని గిరిజన వసతి గృహాలు, పాఠశాలలోని విద్యార్థులకు సౌకర్యంగా ఉండేందుకు అవసరమైన అన్ని మౌలిక వసతులు కల్పించాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో గిరిజన పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాల్లో చేపడుతున్న వివిధ రకాల అభివృద్ధి పనులకు సంబంధించి హాస్టల్ వార్డెన్ లు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి మాట్లాడుతూ గిరిజన పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థులకు అవసరమైన అన్ని మౌలిక వసతులు కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పెండింగ్ లో ఉన్న మరమ్మత్తుల పనులను నాణ్యతతో చేపట్టడంతో పాటు నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం సూచించిన మెనూ ప్రకారం పాఠశాలలు వసతి గృహాల్లో నాణ్యతతో కూడిన ఆహార పదార్థాలను పిల్లలకి అందించాలన్నారు. స్టడీ అవర్ కు సంబంధించి టీచర్లు సక్రమంగా వచ్చే విధంగా చర్యలు తీసుకోవడంతో పాటు పిల్లలు గైర్హాజరు కాకుండా చూడాలన్నారు. అలాగే ఏఎన్ఎంలకు కేటాయించిన విధులను పర్యవేక్షిస్తూ సక్రమంగా చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. 6 నుండి 10 తరగతి వరకు చదువుతున్న అమ్మాయిలు రెండు రోజుల కంటే ఎక్కువగా హాజరుకాని పక్షంలో సంబంధిత ఉపాధ్యాయులు, వార్డెన్లు స్వయంగా విద్యార్థుల ఇళ్లకు వెళ్లి విషయాన్ని తెలుసుకొని పాఠశాలలక హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. అలాగే మండల ప్రత్యేక అధికారులు, తాసిల్దారులు, మండల అభివృద్ధి అధికారులు తరచుగా పర్యవేక్షించి సంబంధిత నివేదిక ఇవ్వాలని కలెక్టర్ సూచించారు.



వసతి గృహాలు తరగతి గదులలో లైట్లు, ఫ్యాన్లు తదితర సదుపాయాలను పరిశీలించి అవసరమైన మేరకు చర్యలు తీసు కోవాలన్నారు. అలాగే తాగునీటి వసతి, టాయిలెట్లు విద్యార్థులకు అందు బాటులో ఉంచాలన్నారు. అవసరమైన మరమ్మత్తులను వెంటనే చేయించేందుకు చర్యలు తీసుకోవాలని డిటి డబ్ల్యూఓను కలెక్టర్ ఆదేశించారు. వసతి గృహాల్లో మౌలిక వసతుల కల్పనకు అవసరమైతే దాతల సహకారం తీసుకొని ఏర్పాట్లు చేసేందుకు సంబంధిత తాసిల్దార్లు, ఎంపీడీవోలతో ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటానని కలెక్టర్ తెలిపారు. పిల్లల ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవడంతో పాటు క్రమం తప్పకుండా పిల్లలకు నులిపురుగుల మాత్రలు, ఐరన్ టాబ్లెట్ లు, ఆరోగ్య సూచనలు వారికి షెడ్యూల్ ప్రకారం అందించే విధంగా చూడాలని అన్నారు. పిల్లలు హాజరు కాలేకపోయినా వెంటనే పై అధికారులకు తెలియజేయాలని తెలిపారు. పిల్లల హాజరు విషయంలో శ్రద్ధ వహించాలని, ముఖ్యంగా బాలికల హాజరుపై మరింత జాగ్రత్త వహించాలన్నారు.

**బాల్య వివాహాల నిర్మూలనకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోండి**

జిల్లాలో బాల్యవివాహాలు జరగకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సంబంధిత కమిటీ సభ్యులను జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి ఆదేశించారు. బాల్య వివాహాలు అత్యంత ప్రమాదకరమని ఏ ప్రాంతంలో జరిగిన నిరోధించేందుకు అప్రమత్తంగా ఉండాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరిగినా, ప్రోత్సహించినా బాల్య వివాహాల నిషేధ చట్టప్రకారం చర్యలు తీసుకోబడతాయని. బాల్య వివాహాల నిర్మూలనపై క్షేత్రస్థాయిలో తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు

# త్వరలోనే పార్టీ నూతన కమిటీలను ప్రకటిస్తాం

**- అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ప్రకటన**
**- పరిశీలకులతో కలిసి పార్టీ కార్యాలయంలో సమావేశం**
**- కమిటీలపై తుది కసరత్తు దాదాపు పూర్తయింది : ఎమ్మెల్యే**



**అనంతపురం క్రైం - సూర్య వాస్తవం, జూలై 26:** అనంతపురం అర్బన్ నియోజకవర్గానికి సంబంధించిన తెలుగు దేశం పార్టీ నూతన కమిటీలను త్వరలోనే ప్రకటిస్తామని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు. పార్టీ అనుబంధ కమిటీలు, నగర కమిటీల ఎంపిక పై అనంతపురం అర్బన్ టీడీపీ కార్యాలయంలో కీలక సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పార్టీ సంస్థగత ఎన్నికల పరిశీలకుడు సోమిశెట్టి వెంకటేశ్వర్లు, అనంతపురం నియోజకవర్గ టిడిపి పార్టీ అబ్జర్వర్ లక్ష్మీనారాయణ, ఇతర నాయకులు పాల్గొన్నారు. ఇప్పటికే కొన్నింటిపై నిర్ణయం తీసుకున్నప్పటికీ కొన్ని చోట్ల ఎక్కువ మంది పోటీ ఉన్నారు. గత ఐదేళ్లుగా పార్టీ కోసం ఎవరెవరు కష్టపడ్డారు. గత ఎన్నికల్లో ఎవరు పని చేశారు.. పార్టీ సభ్యత్వ నమోదు, ప్రస్తుతం సుపరిపాలన కార్యక్రమంలో ఎవరెవరు యాక్టీవ్ గా పాల్గొంటున్నారు వంటి అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి మాట్లాడుతూ పార్టీలో కష్టపడ్డ వారికి పదవులు ఉంటాయన్నారు. ఇందులో తన గెలుపు కోసం పని చేసినా పని చేయకపోయినా.. గత ఐదేళ్లలో పార్టీ కోసం పని చేసిన వారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. అలాగే ఇటీవల పార్టీ చేపట్టిన కార్యక్రమాల్లో ఎలా పని చేశారన్నది కూడా పరిగణలోకి తీసుకుంటామన్నారు. ఇప్పటికే ఈ ప్రక్రియ తుదిదశకు వచ్చిందని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి తలారి ఆదినారాయణ, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గాజుల ఆదెన్న, తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి సాకే లక్ష్మీనరసింహ, టిడిపి మైనార్టీ సెల్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ సైపుద్దీన్, తెలుగు యువత జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్ యాదవ్, మాజీ కార్పొరేటర్ సరళ, టిడిపి ఆర్యవైశ్య నాయకుడు కృష్ణం రఘు తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ కమిషనర్‌కు కార్మికుల కృతజ్ఞతలు

**- ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు కే.నాగభూషణం**



**రాయదుర్గం - సూర్య వాస్తవం, జూలై 26:** రాయదుర్గం పురపాలక సంఘంలో ఇంజనీరింగ్ సెక్షన్‌లో పనిచేస్తున్న కార్మికుల పనుల మార్పుపై సానుకూలంగా స్పందించిన మున్సిపల్ కమిషనర్‌కి కార్మికులు అందరూ తరపున కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు కే.నాగభూషణం తెలిపారు. శనివారం ఇంజనీరింగ్ కార్మికుల పని విభజనపై కమిషనర్ తో మాట్లాడడానికి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు, జిల్లా నాయకులు రాయదుర్గానికి రావడం జరిగింది. కమిషనర్ అందు బాటులో లేకపోవడంతో ఫోను ద్వారా కార్మికుల సమస్యలపై కమిషనర్‌తో ఏపీ మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు కే.నాగభూషణం మాట్లాడారు. మొన్నటి వరకు ఏ ప్రదేశంలో అయితే కార్మికులు విధులు నిర్వహిస్తున్నారు. ఆ కార్మికులను పనులను, ప్రదేశాలను మారుస్తూ కమిషనర్ తీసుకున్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని అదేవిధంగా గతంలో ఏ చోట అయితే ఇంజనీరింగ్ కార్మికులు పనిచేసే వారు అదే చోట అదే విధులను వారికి అప్ప గించాలని, కార్మికులకు ఎటువంటి ఇబ్బందులను కలగజేయరాదని కమిషనర్‌ని కోరారు. అందుకు స్పందించిన కమిషనర్ తప్పకుండా కార్మికులను యధావిధిగా వారు చేస్తున్న పనులను వారికి అప్పగిస్తూ వారి స్థానంలోకే పంపుతామని హామీ ఇవ్వడం జరిగింది. దీంతో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు తమ విన్నపానికి స్పందించినటువంటి మున్సిపల్ కమిషనర్ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ తరపున కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి బి.మల్లికార్జున, పారిశుధ్య ఇంజనీరింగ్ కార్మికులు రాము తిప్పేస్వామి మల్లేష్ తిప్పేరుద్ర నరసింహులు మైలారి సీనప్ప ఇస్మాయిల్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## కూటమి ప్రభుత్వం
# ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

**- వైసీపీ సీనియర్ నాయకులు సింగం క్రిష్ణారెడ్డి**



**సిద్దవటం - సూర్యవాస్తవం, జూలై 26:** కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని వైసీపీ సీనియర్ నాయకులు సింగం క్రిష్ణారెడ్డి డిమాండ్ చేశారు. మండలంలోని టక్కోలులో శనివారం ఆయన మాట్లాడుతూ 2024-25, 2025-26 సంవత్సరాలకు సంబందించిన విద్యార్థుల ఫీజు రీయంబర్స్మెంట్ బకాయిలు పెండింగ్ ఉండడంతో కళాశాల యజమాన్యాలు విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వక పోవడంతో వారు ఉన్నత చదువులకు వెళ్లలేక ఇబ్బంది పడుతున్నారన్నారు. విద్యార్థులకు ఫీజు రీయంబర్స్మెంట్ పెండింగ్ బకాయిలను వెంటనే విడుదల చేసి వారికి ఉన్నత విద్య అభ్యసించేందుకు కృషి చేయాలన్నారు. అలాగే రైతులకు అన్నదాత సుఖీభవ నిధులు విడుదల చేయక, పంటలకు గిట్టుబాటు ధరలు లేక రైతన్నలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పందించి ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ఆయన పేర్కొన్నారు.

# సంతృప్తి పాలనకు ప్రజా మద్దతు

**- రాయదుర్గం పట్టణంలో ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు**



**రాయదుర్గం - సూర్య వాస్తవం, జూలై 26:** ఐదేళ్ల వైకాపా రాక్షస పాలనలో ఎన్నో చేదు అనుభవాలతో విసిగివేసారిన ప్రజానీకం చంద్రబాబు పాలనపట్ల సంతృప్తి వ్యక్త పరుస్తున్నారని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు వెల్లడించారు. అభివృద్ధి, సంక్షేమానికి సమ ప్రాధాన్యత నిస్తున్న కూటమి ప్రభుత్వానికి జై కొడుతున్నారనీ రాయదుర్గం పట్టణ పర్యటనలో పేర్కొన్నారు. సుపరిపాలన లో తొలిఅడుగు కార్యక్రమాన్ని శనివారం ఆయన 20, 21వ వార్డుల్లో నిర్వహించారు. చంద్రబాబు నాయకత్వంలో ప్రతి పేదోడి ఇంటికి ఏదో ఒక సంక్షేమ పథకం ద్వారా ఆర్థిక చేయూత అందుతోందన్నారు. గత ఎన్నికల్లో తనకు అఖండ మెజారిటీతో సత్తా చాటిన రాయదుర్గం ప్రజలు అదే సంపూర్ణ మద్దతును కూటమి ప్రభుత్వానికి అందిస్తున్నారన్నారు. వాడవాడలా, గ్రామాగ్రామానా వెంట నడుస్తూ తమ సంతృప్తిని వ్యక్తపరుస్తున్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో వెల్లువిరుస్తోన్న ప్రజా ఉత్సాహమే అందుకు నిలువెత్తు సాక్ష్యమని ఆనందం వ్యక్తపరిచారు. చంద్రబాబు పాలనతోటే రాష్ట్ర భవిష్యత్తు ఆధారపడిందన్నారు. ఎన్ని ఆర్థిక సమ స్యలు ఎదురవుతున్నా ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం ప్రతి సంక్షేమ కార్యక్రమాన్ని అమల్లో పెడుతున్నారని గుర్తు చేశారు. ప్రజలు భవిష్యత్తులో ఇదే విధమైన ఆదరాభిమానాలు అందిస్తూ కూటమి ప్రభుత్వాన్ని ఆదరించాలని విన్నవించారు. ఈ కార్యక్రమం లో పైతోట రామంజి, అంజి, సీనా, మార్కెట్ యార్డ్ చైర్మన్ హనుమంత రెడ్డి, బండి చిన్న,డాక్టర్ ఛన్నవీరా,పూజారి శివ తదితరులు పాల్గొన్నారు.

# దేవాలయాలు అభివృద్ధి చేసుకుందాం



**రాప్తాడు - సూర్య వాస్తవం:** గ్రామాలలోని దేవాలయాలను అభివృద్ధి చేసుకుందామని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత పేర్కొన్నారు.రాప్తాడు మండల పరిధిలోని భోగినేపల్లి గ్రామం శ్రీచెన్నకేశవ స్వామి దేవస్థానం పనుల పునరుద్ధరణ కోసం రూ.65లక్షల 60వేలు దేవాదాయ శాఖ నిధులు మంజూరు అయ్యాయని తెలిపారు. భోగినేపల్లి గ్రామ పెద్దలు ఎమ్మెల్యే పరిటాల సునీత కు హృదయపూర్వకంగా కృత్ఙతలు తెలియజేశారు. అలాగే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

# అన్నమయ్య జిల్లా ఐసిడిఎస్ పీడీగా బాధ్యతలు




**అన్నమయ్య బ్యూరో - సూర్య వాస్తవం, జూలై 26 :** అన్నమయ్య జిల్లా అంగన్వాడి ప్రాజెక్టు డైరెక్టర్గా కే హైమావతి శనివారం బాధ్యతలు చేపట్టారు. ఈమె ముద్దనూరు ఐసిడిఎస్ సిడిపిఓగా ఉంటూ పదోన్నతిపై అన్నమయ్య జిల్లాకు వచ్చినట్లు పేర్కొ న్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్వాడి సెంటర్‌లపై నిఘా ఉంచ డమే కాకుండా సెంటర్ల పనితీరుపై తగుచర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఆమెను పలువురు సిడిపిఓలు సూపర్వైజర్లు కలిసి పరిచయం చేసుకున్నారు.

# దగ్గుపాటి లాంటి ఎమ్మెల్యే చాలా అవసరం

- అబ్జర్వర్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు - సుపరిపాలన కార్యక్రమంలో పార్లమెంట్‌లోనే అనంతపురం నెంబర్ -1
- రాష్ట్రంలో జరిగిన అవినీతికంతా బాస్ జగన్ రెడ్డేనన్న సోమిశెట్టి





**అనంతపురం క్రైం - సూర్య వాస్తవం, జూలై 26:** అనంతపురం లాంటి నగరానికి దగ్గుపాటి ప్రసాద్ లాంటి ఎమ్మెల్యే చాలా అవసర మని నియోజకవర్గ పార్టీ సంస్థా గత ఎన్నికల అబ్జర్వర్, కర్నూల్ అర్బన్ అథారిటీ చైర్మన్ సోమిశెట్టి వెంకటశ్వర్లు అభిప్రాయపడ్డారు. ఎమ్మెల్యే దగ్గుపాటితో కలిసి ఆయన సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొన్నారు. సుపరిపాలన కార్యక్రమంలో పార్లమెంటులోని అనంత పురం నియోజకవర్గాన్ని నెంబర్ వన్‌గా నిలిపారని అన్నారు. పార్టీ కోసం ప్రజల కోసం ఎమ్మెల్యే దగ్గుపాటి ఎంతో కష్టపడుతున్నారని ప్రజలకు ఏం చేయాలి, నగ రాన్ని ఎలా అభివృద్ధి చేయాలన్న తపన ఆయనలో కనిపిస్తుందన్నారు. ఈ ప్రభు త్వంపై ప్రజలకు పూర్తి విశ్వాసం ఏర్పడిందని మాకోసం పనిచేసే ముఖ్యమంత్రి వచ్చాడన్న అభిప్రాయం ప్రజల్లో కనిపి స్తోందన్నారు. కానీ జగన్ రెడ్డి మాత్రం రాష్ట్రంలో అరాచకాలు సృష్టిస్తూ అగ్నిగుండంలా చేయాలని చూస్తున్నారన్నారు. మిథున్ రెడ్డి లిక్కర్ కేసులో అరెస్టు అయ్యాడని రాష్ట్రంలో జరిగిన అవినీతికంతా జగన్ రెడ్డి బాస్ అని అన్నారు. దేశంలో ఏ నాయకుడు చేయని విధంగా అవినీతికి పాల్పడ్డారని అతన్ని చచ్చే వరకు జైల్లోనే ఉంచాలని సోమిశెట్టి వెంకటేశ్వర్లు తీవ్ర వ్యాఖ్యలు చేశారు.

# సైబర్ నేరగాళ్ల వలలో పడకండి





**రాయదుర్గం - సూర్య వాస్తవం, జూలై 26:** రాయదుర్గం ప్రభుత్వ బాలుర జూని యర్ కళాశాల రాయదుర్గం సర్కిల్ శక్తి టీం వారి ఆధ్వర్యంలో కళాశాల ఇన్‌ఛార్జి ప్రధానాచార్యులు కే.వీరేష్ అధ్యక్షతన బాలికలు పడుతున్నటువంటి ఇబ్బందులు గురించి అధ్యక్షులు చక్కగా వివరించారు. బాల్యవివాహాలు కూడా జరుగుతుం టాయి. కావున తల్లిదండ్రులకు మీరు వివరించాలి నేను ఒక స్థాయికి వచ్చిన తర్వాత మీరు చెప్పినట్లు పెళ్లి చేసుకుంటానని తెలియజేయాలని తెలిపారు. అదే విధంగా ఎస్సై ప్రసాద్ మాట్లాడుతూ అమ్మాయిలు బయట వెళ్లినప్పుడు జాగ్రత్తగా ఉండాలని, ఎవరైనా మాట్లాడితే వాళ్లతో సంబోధన బాగుండాలి, సెల్ ఫోన్‌లో వాట్సాప్ ఇన్‌స్టాగ్రామ్ ఫేస్బుక్ ట్విట్టర్‌లో ప్రొఫైలు మీ ఫోటో ఉంచకూడదన్నారు. సైబర్ నేరగాళ్లతో మీ ఫోటో మార్ఫింగ్ చేసి మిమ్మల్ని బ్లాక్ మెయిల్ చేసి బెదిరించి డబ్బులు వసూలు చేస్తారు. కావున మీరు జాగ్రత్తగా ఉండాలని బాలికలకు తెలియజేశారు. శక్తి టీం ఏఎస్ఐ విజయ్, హెడ్ కానిస్టేబుల్ నజీర్, కెమిస్ట్రీ అధ్యాపకురాలు అరుణ ఇంగ్లీష్ అధ్యాపకుడు నజీర్ ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు.

# గృహ ప్రవేశ వేడుకల్లో సుగవాసి ప్రసాద్ బాబు

**అన్నమయ్య బ్యూరో - సూర్య వాస్తవం, జూలై 26:** రాయచోటి పట్టణం గాలివీడు రోడ్ లక్ష్మీపురంలో కొండా దామోదర్ రెడ్డి నూతన గృహప్రవేశ వేడుకల్లో రాష్ట్ర టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి టీటీడీ పాలకమండలి మాజీ సభ్యులు రాయచోటి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ నాయకులు సుగవాసి ప్రసాద్ బాబు హాజరై శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయనతో పాటు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



# పిజిఆర్ఎస్ అర్జీలను నాణ్యతతో పరిష్కరించాలి

- వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులపై దృష్టి సారించాలి
- జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి



**రాయచోటి - సూర్యవాస్తవం, జులై 26:** పిజిఆర్ఎస్ అర్జీలను నాణ్యతతో పరిష్కరించాలని వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులపై దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి అధికారులను ఆదేశించారు. శనివారం రాయచోటి కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా అధికారులు, ఎమ్మార్వోలు, ఎంపీడీవోలు తదితరులతో స్వర్ణాంధ్ర పి 4, ఓటరు జాబితా సవరణ, పి జి ఆర్ ఎస్ అర్జీల పరిష్కారాలు, సంక్షేమ శాఖల హాస్టళ్లు, పాఠశాలల ఆకస్మిక తనిఖీలు తదితర అంశాలపై జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా స్థాయి నుంచి గ్రామస్థాయి వరకు ఉన్న అధికారులు మరియు సిబ్బంది స్వర్ణాంధ్ర పి-4 కార్యక్రమంలో పాలుపంచుకొని వారికి చేతనైన చేయూతను పేదవారికి అందజేయాలని సూచించారు. తాను 10 కుటుంబాలు సంయుక్త కలెక్టర్ 10 కుటుంబాలను దత్తత తీసుకున్నామని ఆ కుటుంబాలలోని పిల్లలకు ఉపాధి కల్పనలో సలహాలు ఇవ్వడం చేయూతనివ్వడం వంటి చర్యలు చేపడతామన్నారు. ఇదేవిధంగా ప్రభుత్వ ఉద్యోగులందరూ వారికి తోచిన సహాయాన్ని చేయాలని సూచించారు. వర్షాకాలంలో వచ్చే వ్యాధులపై జాగ్రత్తగా ఉండాలని వైద్య ఆరోగ్యశాఖ అధికారిని ఆదేశించారు. పట్టణాలుమరియుగ్రామాలలో చెత్త సేకరణ పై దృష్టి సారించి తగిన చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్లు పంచాయతీ శాఖ సిబ్బందిని ఆదేశించారు. పి జి ఆర్ ఎస్ ద్వారా అందే అర్జీలపై సమీక్షిస్తూ ముఖ్య మంత్రి కార్యా లయం నుండి వచ్చే అర్జీలపై ప్రత్యేక శ్రద్ధ సాధించాలని అర్జీలను నాణ్యతతో పరిష్కరించాలని ఆదేశించారు. ఓటర్ల జాబితా సవరణ పై సమీక్షిస్తూ ఫారం 7, 8 తదితర పెండింగ్‌లో ఉన్న ఫారంలను త్వరగా ప్రాసెస్ చేయాలని రాజకీయ పార్టీల సూచనల మేరకు తీసుకోవాల్సిన చర్యలు ఏమైనా పెండింగ్లో ఉంటే వాటిపై చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా సంయుక్త కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, మదనపల్లి సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్, రాయచోటి ఆర్డిఓ శ్రీనివాస్, జిల్లా అధికారులు, ఎమ్మార్వోలు ఎంపీడీవోలు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రిలో జేబు దొంగ

- పట్టుకున్న బాధితురాలు
- పోలీసులకు అప్పగింత



**మదనపల్లి - సూర్యవాస్తవం, జులై 26:** ప్రభుత్వ ఆసుపత్రిలో జేబుదొంగలు ప్రత్యక్షమయ్యారు. డాక్టర్ వద్ద చూపించుకోవడానికి వచ్చిన రోగుల వద్ద జేబుదొంగలు మాటువేసి వాళ్ళ వెనకాలే ఉంటూ వారి జేబులను బ్లేడులతో కత్తిరించి డబ్బు దొంగలించుకు వెళుతున్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో సెక్యూరిటీల వైఫల్యం పూర్తిగా బయటపడింది. శనివారం ప్రభుత్వ ఆసుపత్రిలో ఓ జేబుదొంగ రోగి అటెండర్ వద్ద డబ్బులు కొట్టేసేందుకు విఫలయత్నం చేసి పట్టుపడ్డాడు. ఇందుకు సంబంధించి బాధితులు తెలిపిన వివరాల మేరకు.. మదనపల్లె మండలం సిటిఎం చెందిన శంకర తన తల్లి చిన్నపాపమ్మకు అనారోగ్యంగా ఉండడంతో ప్రభుత్వ ఆసుపత్రిలో చూపించేందుకు ఆస్పత్రి వచ్చాడు. పనిలో పనిగా బ్యాంకులో గోల్డ్ లోన్ కట్టేందుకు రూ. 70,000 వెంట తీసు కొచ్చుకొన్నాడు. అయితే 4వ శనివారం బ్యాంకుకు సెలవు కావడంతో, డబ్బు కట్టే వీలు లేక ప్యాంటు జేబులో పెట్టుకున్నాడు. తల్లికి వైద్యం చేయించేందుకు స్థానిక ప్రభుత్వాసుపత్రికి వెళ్లి క్యూలో నిలబడుకుని ఓపీ తీసుకునేందుకు వెళ్తుండగా ఇతని వెనకాలే నిమ్మనపల్లికి చెందిన గోవిందు మరో ఇద్దరు తచ్చాడుతూ వెంబడించారు. ఈ క్రమంలో శంకర జేబును బ్లేడుతో కట్ చేసి డబ్బులను తీసుకున్నారు. గమనించిన తల్లి చిన పాపమ్మ వారిని పట్టుకుంది. గోవిందు మినహా మిగతా ఇద్దరు పరారయ్యారు. దీంతో బాధితులు జేబుదొంగను పోలీసులకు అప్పగించారు. జేబు కట్ చేసే క్రమంలో కొన్ని నోట్లు కూడా తెగిపోయాయి. ప్రభుత్వ ఆసుపత్రిలో పెద్ద ఎత్తున సెక్యూరిటీ ఉన్న ఇలాంటి సంఘటనలతో వారి వైఫల్యం పూర్తిగా బట్టబయలైంది. ఇప్పటికైనా ఆసుపత్రిలో సీసీ కెమెరాలను పటిష్టంగా ఏర్పాటు చేసి, సెక్యూరిటీ అప్రమత్తంగా వ్యవహరిస్తూ ఇలాంటి దొంగతనాలకు చెక్ పెట్టాలని రోగులు కోరుతున్నారు.

# పాఠశాల విలీనం మాకొద్దు...

- పాఠశాల ముందు నిరసన తెలిపిన విద్యార్థులు, తల్లిదండ్రులు
- బడి బయట విద్యార్థులకు విద్యాబోధన అందిస్తున్న గ్రామస్తులు
- పట్టించుకోని అధికారులు ప్రజాప్రతినిధులు



**పెళ్లకూరు - సూర్యా వాస్తవం, జూలై 26:** రాష్ట్ర ప్రభుత్వం విద్యా శాఖలో తలపెట్టిన పాఠశాల విలీనం విధానం మాకు వద్దు మా గ్రామ పాఠశాల మాకు ముద్దు పాఠశాల విలీనం విధానం రద్దు చేయాలి అంటూ నినాదాలు ఇస్తూ అయ్యపాలెం ప్రాథమిక పాఠశాల వద్ద శనివారం 3,4,5 తరగతి విద్యార్థులు వారి తల్లిదండ్రులు గ్రామస్తులు నిరసన తెలియజేశారు.వివరాల మేరకు ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన పాఠశాల విలీన విధానంలో అయ్యపాలెం ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న 3,4,5 తరగతి విద్యార్థులను16 మందిని సుమారు 5 కిలోమీటర్ల దూరంలో ఉన్న లింగంపాడు ప్రాథమిక పాఠశాలలో విలీనం చేశారు. అయ్యపాలెం నుండి లింగంపాడు కి విద్యార్థిని విద్యార్థులు పోవాలంటే రైల్వే ట్రాక్ వద్ద అండర్ బ్రిడ్జ్ నుండి హైవేపై వెళ్లి అక్కడి నుంచి పంట పొలాల్లో 5 కిలోమీటర్ల దూరం వెళ్లవలసిఉంది వర్షాకాలం పోవాలంటే అండర్ బ్రిడ్జిలో వర్షపు నీరు చేరుతుంది, అప్పుడు రైల్వే ట్రాక్ దాటి పోవలసి ఉంటుంది, ఇలాంటి ప్రమాదాల మధ్య మా పిల్లలు అంత దూరం పోవాలంటే చాలా ఇబ్బందులు పడాల్సి వస్తుంది, కాబట్టి మాకు విలీనం వద్దు మా పాఠశాలలోనే మా పిల్లలు చదువుకుంటారు లేదంటే బడి మానేసి కూలి పనులను చేసుకుని జీవనం చేస్తామే గాని అంత దూరం ప్రమాదాల మధ్య మా బిడ్డలని బడికి పంపించమని విద్యార్థుల యొక్క తల్లిదండ్రులు పాఠశాల ముందు నిరసన తెలిపారు. పాఠశాల విలీనం చేసినప్పటి నుంచి అక్కడున్న 16 మంది విద్యార్థులు బడిబయట కూర్చొని ఆ గ్రామానికి చెందిన డిగ్రీ చేసిన మహిళ సుభాషిని అనే ఆమె విద్యను అందిస్తూ ఉన్నది, అధికారులు ప్రజాప్రతినిధులు స్పందించి పరిశీలించి మా బిడ్డలును మా గ్రామంలో ఉండే పాఠశాలల్లోనే చదివే విధంగా చర్యలు తీసుకోవాలని విలీనం పాఠశాలకి మేము పంపమని అక్కడికి వెళితే మా బిడ్డలకు పోవు మార్గంలో ప్రమాదమేనని విద్యార్థుల తల్లిదండ్రులు వారి ఆవేదాన్ని వ్యక్తం చేస్తున్నారు.



# బాలికను అత్యాచారం చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

## - వైసీపీ నాయకులు



**గుత్తి - సూర్య వాస్తవం, జూలై 26 :** గుత్తి మైనర్ బాలికను అత్యాచారం చేసిన వారిని కఠి నంగా శిక్షించాలి గుంతకల్లు మాజీ ఎమ్మెల్యే వైబివెంకట రామిరెడ్డి ఆదేశాలు గుత్తి పట్టణంలోని ఆర్ అండ్ బీ బంగ్లాలో శనివారం వైయ స్సార్సీపీ ఎస్సీ ఎస్టి సెల్ నాయకులు ఆధ్వర్యంలో ప్రెస్మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ మహిళ అధ్యక్షురాలు బిందె వరలక్ష్మి యాదవ్ కౌన్సిలర్ వరదరాజులు జిల్లానాయ కులు కేఎం రంగనాయకులు మున్సిపల్ విభాగం ఉపాధ్య క్షులు అరుణ్ కుమార్ తదిత రులు మాట్లాడారు.రాష్ట్రం లో చిన్నపిల్లల నుంచి వృద్ధు ల వరకు అందరిపై అత్యాచారం జరుగుతున్న ముఖ్య మంత్రి చంద్రబాబు, ఉప ము ఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, హెూమ్ శాఖామంత్రి అనిత పట్టించుకోవడం లేదన్నారు. అత్యా చారాలను, అరాచకా లను ప్రశ్నించే వైఎస్ఆర్ సీపీ నాయకుల గొంతులు నొక్క దానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. ప్ర శ్నించే వారిపై అక్రమ కేసులు బనాయించి శునకానందం పొందుతున్నారని విమర్శిం చారు. 14 మంది మృగాల చే తిలో అత్యా చారానికి గురైన ఏడు గుర్రాల పల్లికు చెందిన మైనర్ బాలిక కు న్యాయం చేసే వరకు వైయస్సార్సీపీ పోరాటం చేస్తుందన్నారు. మైనర్ బాలికకు న్యాయం చెయ్యాలని డిమాండ్ చేశా రు.కూటమి నాయకుల బెది రింపులకు, అక్రమ కేసులకు భయపడే ప్రసక్తే లేదన్నారు. ప్రజా కోర్టులోనే తెలుసుకుం టామన్నారు.ఈ కార్యక్రమం లో పాల్గొన్న గుత్తి టౌన్ మం డల కన్వీనర్లు కన్వీనర్ కప్ప లబండ మధుసూదన్ రెడ్డి, గంగరాజు రాష్ట్ర నాయకులు సీవీ రంగారెడ్డి,జిల్లా ప్రధాన కార్యదర్శిలు సుభాష్ రెడ్డి,గు రుప్రసాద్, యాదవ్, రంగస్వామి, మార్తాడ్ అన్సర్,కౌన్సిలర్ వాల్మీకి శివరాం, టౌన్ వైస్ ప్రెసిడెంట్ మున్వర్(ము న్నా) మహమ్మద్ షఫీ ఎస్ సి సెల్ కన్వీనర్లు మలికార్జు న,బేతపల్లి ఆంజనేయు లు(అంజి) ఎస్టి సెల్ కన్వీనర్లు విజయ్ కుమార్ లాల్ నాయక్,దేవేంద్రా (దే వా)కౌన్సిలర్ నరేష్ అరటి పండ్ల చంద్ర తపేల సునీల్ కుమార్,ఆర్,రంగస్వామి,ఉబ్బిచర్ల రామకృష్ణ,ఊటకల్లు సుధాకర్,అబ్దుల్ రౌఫ్ పోలీస్ అబ్దుల్, సోషల్ మీడి యా జేపీ గాదిలింగా,మా బా షా, వైస్సార్ రాజూ,25వార్డు హరిబాబు,బళ్లారి హరినాథ్ రెడ్డి,ఎల్ ఐసీ హరినాథ్ రెడ్డి, మార్తాడ్ దాదా పిరా,చేటనే పల్లి వీరంజినీయు లు,కొత్తపే ట వేణు కుమార్,జక్కల చె రువు ఎరుకాల చంద్ర,బ్రహ్మ పల్లి పెద్దన్న,బేతపల్లి సురేష్ బోయగడ రాము,7వ వార్డు రంగస్వామి 7వ వార్డు రవి తేజా పులా మహమ్మద్,లా ల్ పాల్గొన్నారు.

# రక్తదానం ప్రాణదానంతో సమానం

## - అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ జోగేంద్ర

**మదనపల్లి - సూర్య వాస్తవం, జూలై 26:** రక్తదానం చేసామంటే ఒకరికి ప్రాణ దానం చేసిన దానితో సమాన మని ఎక్సైజ్ సూపరింటెండెంట్ మధుసూదన్ తెలిపారు. మత్తు బానిసైన ఐదు మంది రోగులను ఎక్సైజ్ సూపరిం టెండెంట్ ఆధ్వర్యంలో శనివారం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువచ్చారు. ప్రభుత్వ ఆసుపత్రిలో డి అడిక్షన్ సెంటర్ నిర్వహిస్తున్న డాక్టర్ రాధిక వారికి కౌన్సిలింగ్ ఇచ్చారు. చికిత్స నిమిత్తం వారిని ఆస్పత్రిలో చేర్పించారు. అనం తరం సామాజిక సేవ కార్యక్రమంలో భాగంగా రక్తదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా ఎక్సైజ్ ఎస్ఐ జెబీవుల్లా రక్తదానం చేశారు. ఈ సంద ర్భంగా సూపరింటెండెంట్ మధుసూదన్ మాట్లాడుతూ... మనం దానం చేసే ఒక్క యూనిట్ రక్తం ఒకరి ప్రాణాన్ని నిలబెడు తుందన్నారు.




ఇది చాలా మంచి సేవా కార్యక్రమమని, ప్రతి ఒక్కరూ ఇలాంటి సేవా కార్యక్రమాలను అలవర్చు కోవాలని తెలిపారు. ఇటీవల కాలంలో మత్తుకు బానిసై ఎన్నో కుటుంబాలు వీధిన పడుతున్నాయని, వారి కుటుం బాల్లో తిరిగి ఆనందం వెల్లి విరిసేలా బానిసైన వారిని గుర్తించి వారిని డి అడిక్షన్ సెంటర్లో చేర్పించడం జరుగు తోందన్నారు. ఇలాంటివారిని గుర్తించి ప్రతి ఒక్కరు వారికి కౌన్సిలింగ్ ఇచ్చే విధంగా ఆసుపత్రిలో చేర్పించి తమ వంతు కృషి చేయాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ జోగేంద్ర, సిఐ భీమలింగ సిబ్బంది పాల్గొన్నారు.



# గ్రామాల అభివృద్ధికి మహిళల భాగస్వామ్యం కీలకం

## - జడ్పిటిసి ప్రిస్కిల్లా
## - మహిళల ఆర్థిక అభివృద్ధితో గ్రామాల రూపురేఖల మార్పే లక్ష్యం
## - మహిళలతో కలిసి గ్రామాల రేఖలు మార్చే ప్రణాళిక సిద్ధం




**పెళ్లకూరు- సూర్యా వాస్తవం, జూలై 26:** తిరుపతి జిల్లా పెళ్లకూరు మండలానికి చెందిన జడ్పిటిసి నన్నం ప్రిస్కిల్లా, జిల్లా పరిషత్ కార్యాలయంలో మూడు రోజులపాటు నిర్వహించిన మహిళల శిక్షణా శిబిరంలో పాల్గొన్నారు. గ్రా మీణ మహిళల ఆర్థిక స్థిరత్వమే గ్రామాభివృద్ధికి అసలైన బలమని పెళ్లకూరు మండల జడ్పిటిసి సభ్యురాలు నన్నం ప్రిస్కిల్లా అన్నారు. జిల్లా ప్రజాపరిషత్ కార్యాల యంలో ముగిసిన మూడు రోజుల శిక్షణా శిబిరం అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడారు. "మహిళలు స్వయం సంప న్నులుగా మారితే గ్రామాల రూపురేఖలు స్వయంగా మార తాయి. అభివృద్ధి కోసం మహిళలతో కలిసి ముం దుకు సాగే ప్రణాళికపై మేము ఇప్పటికే ఆలోచిస్తున్నాం," అని ఆమె తెలిపారు. అంతేగాక, మండలంలోని ప్రతి గ్రామం లో పర్యటించి అభివృద్ధి వెనుకబడిన అంశాలపై మహిళలతో నేరుగా చర్చించి చర్యలు తీసుకోవాలని సంక ల్పించామని వెల్లడించారు. మహిళల అభిప్రాయాల మేరకు గ్రామాల్లో ప్రణాళికాబద్ధమైన మార్పులు తేవడమే లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో మండలా ధ్యక్షులు, మాస్టర్ ట్రైనర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



# స్వచ్ఛ కుప్పం సాధనకు ముందుకొచ్చిన ఏజిఐస్ స్వచ్ఛంధ సంస్థ

**కుప్పం- సూర్య వాస్తవం, జూలై 26 :** స్వచ్ఛ కుప్పం సాధనకు ఏజీఐస్ సంస్థ ముందుకు రావడం హర్షించదగ్గ విషయమని పురపాలక సంఘం కమిషనర్ శ్రీనివాసరావు తెలిపారు. శనివారం కుప్పం పురపాలక సంఘం తరఫున ఏజిఐస్ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గోపాలకృష్ణ మూర్తి తో ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ స్వచ్ఛ కుప్పం సాధన లక్ష్యంగా పురపాలక సంఘం పనిచేస్తున్నట్టు తెలిపారు. ఇందుకు సహకరిస్తూ ఐటిసి సంస్థకు చెందిన ఏజిఐస్ స్వచ్ఛంద సంస్థ ముందుకు రావడం ఆనందంగా ఉందన్నారు. ఏజిఐస్ సంస్థతో జరిగిన ఒప్పందం ప్రకారం సంస్థ వారు పట్టణ



ప్రజలకు తడి చెత్త, పొడి చెత్త వేరు చేయడం, రోజు వారి ఉత్పత్తి జరిగే చెత్త నిర్వహణకు సంబంధించి ప్రజలకు అవగాహన కల్పించడం, వ్యర్థాలను విభజన చేసేలా ప్రజలను ప్రోత్సహించి ఆరోగ్యకరమైన, పరిశుభ్రమైన స్వచ్ఛ కుప్పం లక్షాన్ని సాదించడమే ప్రాజెక్ట్ లక్ష్యమని అన్నారు. అలాగే చస్తాను రీసైక్లింగ్ చేయడం, హెూం కంపోస్టు చెయడం పైన ప్రజలకు అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. సి.ఆర్.ఎస్. ప్రాజెక్ట్ క్రింద కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ ఒప్పందంలో పురపాలక సంఘం ఎ.ఇ. ఆంజ నేయులు నాయక్, ఎ.జి.ఎస్. రీజినల్ కోఆర్డినేటర్ కుమారి పాల్గొన్నారు.

# కారు ఢీకొని ఇద్దరికి గాయాలు





**మదనపల్లె - సూర్య వాస్తవం, జూలై 26:** ద్విచక్ర వాహనంపై వెళ్తున్నవారిని కారు ఢీకొనడంతో ఇద్దరు గాయ పడ్డారు. ఈ సంఘటన శనివారం ములకలచెరువు మండలంలో జరిగింది. బాధితుల కథనం మేరకు.. బురకా యలకోట సమీపంలోని చంద్రాజులపల్లెకు చెందిన ఆదినారాయణ (63) కోడలు వెంకటరత్నమ్మ (35) తో కలిసి వ్యవసాయ పొలానికి ద్విచక్ర వాహనంలో బయలుదేరారు. ఈ సమయంలో బురకాయలకోట వద్ద అటుగా వెళ్తున్న కారు వీరిని ఢీకొంది. ఈ ప్రమాదంలో గాయపడిన ఇద్దరిని స్థానికులు 108 లో మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు బాధితులను ఆసుపత్రిలో చేర్చి చికిత్స అందిస్తున్నారు. ములకల చెరువు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# సత్ప్రవర్తనతో సమాజంలో మెలగాలి

## - అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు : డిఎస్పీ మహేంద్ర



**మదనపల్లి - సూర్య వాస్తవం, జూలై 26:** అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని, సత్ప్రవర్తనతో సమాజంలో మెలగాలని డిఎస్పీ మహేంద్ర తెలిపారు. శనివారం పట్టణంలోని పోలీస్ స్టేషన్ల పరిధిలో ఉన్న రౌడీషీటర్లకు డీఎస్పీ కార్యాలయ ఆవరణంలో కౌన్సిలింగ్ నిర్వహించారు. శాంతిభద్రతల పర్య వేక్షణలో భాగంగా రౌడీషీటర్ల పై ప్రత్యేక నిఘా ఉందని, చట్టాన్ని అతిక్రమించి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆర్థిక పరమైన అంశాలు, భూ దందాలు, సామాన్య ప్రజలను ఇబ్బందులకు గురిచేయడం వంటి విషయాలు తమ దృష్టికి వస్తే తగు రీతిలో చర్యలు తీసుకుంటామన్నారు. జీవితంలో జరిగిన కొన్ని పొరపాట్ల వల్ల కేసులు నమోదై పోలీసు రికార్డుల్లో రౌడీ షీటర్లుగా నమోదయ్యారని, సమాజంలో సత్ప్రవర్తనతో మెలిగినప్పుడే మీకు, మీ కుటుంబాలకు విలువ ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా ప్రతి ఒక్కరి షీట్లను తనిఖీ చేసి, వారి కేసులను పరిశీలించి, వారిలో సత్ప్రవర్తన తీసుకొచ్చేందుకు కౌన్సిలింగ్ ఇచ్చారు. సత్ప్ర వర్తనతో మెలిగితే క్రమంగా షీట్లను తొలగిస్తామని, లేని పక్షంలో చట్ట పరిధిలో తీసుకునే కఠిన చర్యల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో డిఎస్పీతో పాటు సిఐలు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

# నాటు సారా స్థావరాలపై దాడులు

**గుత్తి - సూర్య వాస్తవం, జూలై 26 :** గుత్తి ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ పరధిలోని నవోదయం 2.0లో భాగంగా గుత్తి ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ కె ఉమాదేవి వారి సిబ్బంది, గుత్తి మండలంలోని పి.ఎర్రగుడి గ్రామ పరిసర ప్రాంతాలలో నాటు సారా స్థా వరాలపై దాడులు నిర్వహిం చగా,12 లీటర్ల నాటు సారా, కర్ణాటక రాష్ట్రానికి చెందిన 106 (90ఎంల్) తే త్ర పాక్ ఒరిజినల్ ఛాయిస్ డీలక్స్ విస్కీ మధ్యం ను స్వాధీనం చేసుకోని కర్నూలు జిల్లా తుగ్గలి గ్రామానికి చెందిన ఎరుకల పద్మావతి పై కేసు నమోదు చేసి రాజశ్రీ గుత్తి మేజిస్ట్రేట్ వద్ద రిమాం డ్ నిమిత్తమై హాజరు పరచ డమైనది.నకిలీ మద్యం,క ర్ణాటక రాష్ట్రానికి చెందిన మద్యం, సుపూరియస్ లిక్క ర్,నాటుసారా తయారు చేసి న,అమ్మకం చేసిన,రవాణా చేసిన సమాచారాన్ని టోల్ ఫ్రీ నెంబర్ 14405కు అం దించాలని తెలిపినారు,పై తె లిపిన నేరాలకు పాల్పడిన వ్యక్తులపై చట్ట రిత్యా కఠిన చర్యలు తీసుకొనబడును. ఈ దాడులలో గుత్తి ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ కె.ఉమాదేవి సబ్ ఇన్స్పెక్టర్ పి గోపాల్,హెడ్ కానిస్టేబుళ్ళు సి.వెంకట నారాయణ నాగవేణి వెంకటేషులు, నరసింహ రాజు, కానిస్టేబుళ్లు శివయ్య, సునీత పాల్గొన్నారు.



## టి.నారాయణ రెడ్డి, కవితా శర్మని
# సన్మానించిన బీ జే పీ నాయకులు



**గుత్తి -సూర్యవాస్తవం, జులై 26 :** గుత్తిలో శనివారం రోజున భారతీయ జనతా పార్టీ గుత్తి మండల పట్టణ శాఖ తరుపున బీజేపీ అనంతపురం జిల్లా కార్యదర్శి ఎన్ని కైనటువంటి బలక నారా యణరెడ్డి, కవితా శర్మ నిసన్మానించిన భారతీయ జ నతా పార్టీ నాయకులు కార్య కర్తలు కార్యక్రమంలోని గుత్తి పట్టణ మండల బిజెపి పార్టీ నాయ కులు కార్యకర్తలు తదితరులు పాల్గొనన్నారు.

# లక్ష పోస్ట్ కార్డ్స్ ఉద్యమంలో పాల్గొన్న స్కూల్ విద్యార్థులు



**గుత్తి- సూర్య వాస్తవం, జులై 26:** గుత్తి పట్టణం ఆర్డిటి యఫ్ సి ఆర్ ఎని రెన్యువల్ చేయాలని 63 మండలలో ఒక లక్ష పోస్ట్ కా ర్డ్ ఉద్యమంలో భాగంగా ఈరోజు హై స్కూల్లో విద్యార్థినిలచేత కేంద్ర హెూంమంత్రి అమిత్‌షాకి పోస్టుకార్డ్స్ రాయడం జరిగింది. ఈ కార్యక్రమంలో బండల రామాంజినేయులు మిద్దె ఓబులేష్ పా ల్గొన్నారు.

# ప్రమాదంలో గాయపడిన ఏఎన్ఎం రమాదేవి మృతి

**- అనాథలైన పిల్లలు**

**- ప్రభుత్వం ఆదుకోవాలని కోరిన పలువురు నేతలు**








**శాంతిపురం- సూర్య వాస్తవం, జూలై 26:** మండల పరిధిలోని శివరామపురం పంచాయతీ గట్టూరు గ్రామానికి చెందిన రమాదేవి ప్రభుత్వ ఏఎన్ఎంగా విధులను నిర్వహిస్తోంది. ఇటీవల పదోన్నతిపై రాళ్ళబుదుగురు పీహెచ్‌సిలో చేరి ఏఎన్ఎంగా అక్కడ విధులను నిర్వర్తిస్తూ ఈ నెల 16న మండలం కేంద్రంలో కుప్పం చిత్తూరు జాతీయ రహదారిపై ఎస్బిఐ బ్యాంక్ ఎదురుగా ప్రమాదానికి గురైంది.దీంతో ఆమెను 108 ద్వారా,పిఈఎస్ మెడికల్ హాస్పిటల్ కు హుటా హుటిన చికిత్సకోసం తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం ఆమెను బెంగళూరు మణిపాల్ హాస్పిటల్ కి కుటుంబ సభ్యులు తరలించారు. అక్కడి నుంచి కుప్పం వంద పడకల ఆస్పత్రిలో చికిత్స కోసం రాగా అక్కడ చికిత్స పొందుతూ శనివారం రమాదేవి తుది శ్వాస విడిచారు.కాగా ఆమెకు వైద్యం కోసం సుమారు 15 లక్షల దాకా ఖర్చు అయిందని గతంలో ఆమె భర్త అనారోగ్యంతో చనిపోగా వారి ఇద్దరు ఆడపిల్లలు ప్రస్తుతం అనాథలైయ్యారని వారిని ప్రభుత్వం ఆదుకోవాలని స్థానికులు కోరారు. ఇదిలా ఉండగా తల్లి తండ్రి లేని ఆ ఇద్దరు పిల్లల భవిష్యత్తును తలచుకుంటూ కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరయ్యారు.తమతో పాటు ఎంతో చలాకీగా ఉద్యోగం విధులు నిర్వహిస్తున్న రమాదేవి చనిపోయిన విషయం తెలుసుకుని ఆమె సహెూద్యోగులు విషాదంలో మునిగిపోయారు.ఆమె స్వగ్రామం గట్టూరు కు వెళ్ళి అంజలి ఘటించారు.

# అనంతపురంలో కొవ్వొత్తుల ప్రదర్శన

**రాయదుర్గం- సూర్య వాస్తవం, జూలై 26:**

భారతీయ జనతా పార్టీ ఆదేశాల మేరకు దేశ రక్షణ కోసం ప్రాణాలను విడిచిపెట్టిన కార్గిల్ వీర సైనికుల త్యాగాలను గుర్తు చేసుకుంటూ ఘన నివాళు లర్పించిన రాయదుర్గం మాజీ శాసనసభ్యులు కాపు రామచంద్ర రెడ్డి అనంతపురం జిల్లా భారతీయ జనతా పార్టీ అధ్యక్షులు కొనకొండ్ల రాజేష్, అనంతపురం జిల్లా బిజెపి ముఖ్య నాయకులు , కార్య కర్తలు పాల్గొని నివాళులర్పించారు.






## మీ కోసం కాల్ సెంటర్
# 1100 సేవలను వినియోగించుకోండి

- ఈ నెల 28వ తేదీన కలెక్టరేట్ లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహణ
- జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి
- ఇన్‌చార్జి జిల్లా కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ



**అనంతపురం కలెక్టరేట్ – సూర్య వాస్తవం, జులై 26 :** మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను వినియోగించుకోవాలని ఇంచార్జి జిల్లా కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.అర్జీదారులు దాఖలు చేసిన తమ అర్జీలు ఇప్పటికీ పరిష్కారం కాకపోయినా, లేదా తమ ఫిర్యా దులకు సంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి 1100 నంబర్‌కు కాల్ చేయ వచ్చునన్నారు. అర్జీదారులు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవడానికి Meekosam.ap.gov.in (మీకోసం డాట్ ఏపీ డాట్ జివో వి డాట్ ఇన్) వెబ్సైట్‌లో వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవచ్చన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ సమస్యలకు పరిష్కారం పొందాలని ఇంచార్జి జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.28న కలెక్టరేట్ లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహణ ఈనెల 28వ తేదీన సోమవారం అనంతపురం కలెక్టరేట్ లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రెసెల్ సిస్టం, పిజిఆర్ఎస్) కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని ఇంచార్జి జిల్లా కలెక్టర్ తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని కలెక్టరేట్లోని రెవెన్యూ భవనంలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందని, ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొం టారని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో తమ వివరాలతో పాటు వారి సమస్యలకు సంబంధించి అర్జీలను అందజేయాలన్నారు. అర్జీదారులు గతంలో ఇచ్చిన అర్జీలకు సంబంధించిన స్లిప్పును తీసుకు రావాలని సూచించారు. సమస్య పరిష్కార మైనప్పుడు ఫోన్‌కి మెసేజ్ వస్తుందని, అర్జీదారులు వారి ఫోన్‌ను చెక్ చేసుకోవాలన్నారు. నోటీసులు, ఎండార్స్మెంట్ ను వాట్సఅప్ లో పంపిస్తున్నామని, ఎండార్స్మెంట్ బై రిజిస్టర్ పోస్ట్ మీరు ఇస్తున్న అడ్రస్ కు పంపిస్తున్నామన్నారు. అర్జీ ఇచ్చేటప్పుడు దానిని కరెక్ట్‌గా దానిని పూరించాలన్నారు. రిపీటెడ్ అర్జీదారులు పాత రసీదును తీసుకు రావాలన్నారు. జిల్లా ప్రజలు పిజిఆర్ఎస్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# తల్లి జన్మనిస్తుంది రక్తదాత పునర్జన్మనిస్తాడు

**- చెన్నూరు యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో 74 మంది రక్తదానం చేశారు**



**కడప-సూర్య వాస్తవం, జూలై 26:** కడప, అన్నమయ్య జిల్లా స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మెగా రక్త వారోత్సవాల రెండో వార్షికోత్సవంలో భాగంగా ఏడవ రోజు చెన్నూరు స్థానిక చౌడేశ్వరి దేవస్థానం నందు చెన్నూర్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో 74 మంది రక్తదానం చేసి విజయవంతం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న డిస్టిక్ రెవెన్యూ ఆఫీసర్ విశ్వేశ్వర నాయుడు మాట్లాడుతూ రక్తదానం అనేది పుణ్యకార్యంగా భావించి రక్తదానం చేసేం దుకు యువతి యువకులు ముందుకు రావడం ఎంతో గర్వకారణం అని ఈ శిబిరం విజయవంతం అవ్వడానికి కృషిచేసిన ఉట్టి శ్రీకాంత్ నీ మరియు సాదు సునీల్ నీ ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో మరో అతిథిగా పాల్గొన్న అడిషనల్ డిఎంహెచ్వో డాక్టర్ రవిబాబు మాట్లాడుతూ యువత రక్తదానంపై ఈ విధంగా కృషిచేసి చెన్నూరూ నందు ఇంత దిగ్విజయంగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించి యువతి యువకులకు డోర్ టు డోర్ క్యాంపెయిన్ ద్వారా రక్తదానం పై అవగాహన కల్పించిన నిర్వాహకులుకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమానికి మరో అతిథిగా పాల్గొన్న చెన్నూర్ ఎమ్మార్వో సరస్వతమ్మ మాట్లాడుతూ సంవత్సరానికి కనీసం మూడుసార్లు రక్తదానం చేయడం ద్వారా శరీరంలోని రోగ నిరోధక శక్తి పెరగడంతో ఆరోగ్యవంతంగా ఉంటామని కావున ప్రతి ఒక్కరూ రక్తదానం చేసిన ముందుకు రావాలని అన్నారు. ఈ కార్యక్రమం కోఆర్డినేటర్స్ ఉట్టి శ్రీకాంత్ , సాదు సునీల్ మాట్లాడుతూ రక్తదానం యొక్క ఆవశ్యకతను చెన్నూరు మండలంలో విస్తరింప చేసేందుకు ముందు ముందు చాలా కార్యక్రమాలు చేయబోతున్నామని ఈ కార్యక్రమానికి సహకరించిన ప్రతి ఒక్కరికి పేరు పేరునా ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిపిఎం భాస్కర్, చెన్నూరు మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వినయ్ కుమార్, శ్రీ శ్రీ రామలింగ చౌడేశ్వరి దేవి దేవస్థాన సమితి అధ్యక్షులు శ్రీరామ్ మూర్తి, కమిటీ కార్యవర్గం, వికసిత ఫౌండేషన్ చైర్మన్ శూలం లక్ష్మీదేవి, జేబీవీఎస్ వ్యవస్థాపకుడు అశోక్, తదితరులు పాల్గొన్నారు.



## రక్షణ కోరుతూ
# పోలీసులను ఆశ్రయించిన న్యాయవాదులు



**కుప్పం, సూర్య వాస్తవం, జూలై 26:** తమకు ప్రాణహాని ఉందని, పోలీసులు తమను రక్షించాలని కోరుతూ కుప్పం బార్ అసోసియేషన్ సభ్యులు డీఎస్పీని ఆశ్రయించారు. ఈ సందర్భంగా కుప్పం బార్ అసోసియేషన్ అధ్యక్షులు చంద్రప్ప మాట్లాడుతూ కుప్పం న్యాయస్థానంలో వకీలుగా కొనసాగుతున్న శ్రీకాంత్ సురేష్ అనే వ్యక్తి గత నెల రోజులుగా తమ అసోసియేషన్ సభ్యులను, తనను చంపు తామంటూ బెదిరిస్తున్నారని, అతని నుండి తమకు రక్షణ కల్పించాలని కోరుతూ డి.ఎస్.పి పార్థసారథికి ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. కర్ణాటక బార్ అసోసియేషన్ నందు సభ్యత్వం తీసుకున్న వ్యక్తి కుప్పం న్యాయస్థానంలో వకీలుగా కొనసాగుతున్నట్టు తెలిపారు. గత కొంతకాలం క్రితం సదరు వకీలు కుప్పం బార్ అసోసియేషన్ నందు సభ్యత్వం కోరుతూ అర్జీ చేసుకోవడం జరిగిందన్నారు. కర్ణాటక బార్ అసోసియేషన్ సభ్యత్వం కలిగిన వ్యక్తికి కుప్పం బార్ అసోసియేషన్ సభ్యత్వం ఇవ్వడం కుదరదని, కావున తన కర్ణాటక బార్ అసోసియేషన్ సభ్యత్వాన్ని ఆంధ్రప్రదేశ్ బార్ అసోసియేషన్ కు బదిలీ చేసుకున్న అనంతరం మాత్రమే కుప్పం బార్ అసోసియేషన్ సభ్యత్వం ఇవ్వడం కుదురుతుందని బార్ అసోసియేషన్ అధ్యక్షులు సూచించడం జరిగిందన్నారు. అయితే సదరు వ్యక్తి తన సభ్యత్వాన్ని ఆంధ్రప్రదేశ్ బార్ అసోసియేషన్ కు బదిలీ చేసుకోకపోగా, కుప్పం బార్ అసోసియేషన్ లో సభ్యత్వం కొరకు తమను మానసికంగా వేధించినట్టు ఆరోపించారు. ఈ విషయమై స్పందించిన కుప్పం బార్ అసోసియేషన్ తమను వేధిస్తున్న వకీలు విద్యార్హత ధ్రువపత్రాలపై ఆరా తీసినట్టు తెలిపారు.

సదరు వకీలు మైసూరు ఓపెన్ యూనివర్సిటీ ద్వారా డిగ్రీ పూర్తి చేసినట్టు, అనంతరం లా పట్టా పొంది కర్ణాటక బార్ అసోసియేషన్ నందు సభ్యత్వం పొందడం జరిగిందని, కర్ణాటక బార్ అసోసియేషన్ ధ్రువీకరించడం జరిగిందన్నారు. వీటిపై ఆరా తీయగా సదరు వకీలు మైసూర్ ఓపెన్ యూనివర్సిటీలో పొందిన డిగ్రీ ధ్రువపత్రాలు నకిలీవి అని తేలిందన్నారు. ఈ విషయాన్ని సదరు యూనివర్సిటీ 21-11-2024 నాడు ధ్రువపరిచినట్టు తెలిపారు. ఈ ధ్రువీకరణ ఆధారంగా అసలు డిగ్రీ లేని వ్యక్తి లా పట్టా ఎలా పొందారన్న అనుమానాన్ని వ్యక్తం చేస్తూ, అలాంటి వ్యక్తికి సభ్యత్వం ఎలా ఇస్తారని కర్ణాటక బార్ అసోసియేషన్ కు ఫిర్యాదు చేసినట్టు తెలిపారు.

తమ ఫిర్యాదు పై విచారణ ప్రారంభం అయ్యిందని, ఆనాటి నుండి ఆరోపణలు ఎదుర్కొంటున్న వకీలు కుప్పం బార్ అసోసియేషన్ అధ్యక్షులను, సభ్యులను పలు విధాల మభ్య పెట్టడానికి ప్రయత్నించడం జరిగిందన్నారు. ఈ ప్రయత్నాలు విఫలం కావడంతో కుప్పం బార్ అసోసియేషన్ అధ్యక్షులను, పలువురు సభ్యులను చంపుతానంటూ బెదిరింపులకు దిగినట్టు తెలిపారు. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేయడం జరిగిందని, పోలీసులు తగు చర్యలు తీసుకుని తమకు రక్షణ కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కుప్పం పార్క్ అసోసియేషన్ నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

# ప్రైవేటు సంస్థలకు ఆర్టీసీ స్థలాల మంజూరు దారుణం

**కుప్పం ఎన్ఎంయు నేతల నిరసన**



**కుప్పం- సూర్య వాస్తవం, జూలై 26:** ప్రైవేటు సంస్థలకు ఆర్టీసీ స్థలాలను కేటాయించడం పై కుప్పం డిపో పరిధిలోని ఎన్ఎంయు సభ్యులు శనివారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు డిపో ప్రధాన ద్వారం ఎదురుగా ఎర్ర బ్యాడ్జీలను ధరించి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఎన్ఎంయుఏ కుప్పం డిపో అధ్యక్షులు యస్.మునస్వామి, వర్కింగ్ ప్రెసిడెంట్ యం.జి.ప్రసాద్ కుమార్, డిపో కార్యదర్శి ఈ.జయపాల్ లు మాట్లాడుతూ లులు సంస్థకు విజయవాడ, గవర్నర్ పేట్-1, పాత బస్టాండ్ స్థలాలను కేటాయించడం దారుణం అన్నారు. ఆర్టీసీ స్థలాలను సంస్థ అభివృద్ధికి ఉపయోగించాలని సూచిస్తూ, లులు సంస్థకు ఆర్టీసీ స్థలాల కేటాయింపు విషయంలో ప్రభుత్వం పునరాలోచన చేయాలని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో కడప జోనల్ ఆర్గనైజింగ్ కార్యదర్శి జి.రహంతుల్లా, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ డి.గణేష్, డిపో సంయుక్త కార్యదర్శి జి.మునెప్ప, గ్యారేజ్ అధ్యక్షులు కె.దిలీప్ కుమార్, డిపో వర్కింగ్ ప్రెసిడెంట్ వి.జయశంకర్, గ్యారేజ్ కార్యదర్శి యు.మొగిలీశ్వర్, అరుణ్ పాల్గొన్నారు.

# ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వం

- సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో నీరాజనం
- ఎమ్మెల్యేను ఘనంగా స్వాగతం పలికిన సాయి నాథ్ రెడ్డి రాహుల్ యాదవు



**పత్తికొండ టౌన్ – సూర్య వాస్తవం, జూలై 26:** ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వం ధ్యేయమని పత్తికొండ ఎమ్మెల్యే కే ఈ శ్యామ్ కుమార్ అన్నారు. కర్నూలు జిల్లా పత్తికొండ మండలం హెూసూర్ గ్రామంలో సుపరిపాలనకు తొలి అడుగు కార్యక్రమంలో టిడిపి నాయకులు సాయినాథ్ రెడ్డి మరియు రాహుల్ యాదవ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కె ఈ శ్యామ్ కుమార్ పాల్గొన్నారు. ముందుగా గ్రామంలో నిర్మించిన నూతన శ్రీకృష్ణ దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సుపరిపాలనకు తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను ఎమ్మెల్యే కేఈ శ్యామ్ కుమార్ వివరించారు. ప్రతి ఇంటిలో ఉన్న సమస్యలను ఆయన స్వయంగా అడిగి తెలుసుకుని మై టిడిపి యాప్‌లో స్వయంగా వారి సమస్యలను నమోదు చేశారు. తొలి అడుగులో భాగంగా వచ్చిన ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదరికానికి కూడా ముగింపు ఇచ్చేలా మద్దతు ధరలు, పంటబీమా, ఉచిత ఇసుక, పెంచిన పెన్షన్లు, ఆరోగ్యశ్రీ, పిహెచ్ సిల్లో మెరుగైన సేవలు ,విద్యార్థులకు తల్లికి వందనం , స్కూళ్ల ఆధునికీకరణ, మహిళలకు డ్వాక్రా బలోపేతం, ఉచిత రేషన్, మహిళా భద్రత, యువతకు స్కిల్ డెవలప్‌మెంట్, ఉద్యోగ అవకాశాలు, తాగునీటి పథకాలు, గ్రామీణ రహదారుల అభివృద్ధి, స్మార్ట్ గ్రామాల దిశగా కూటమి ప్రభుత్వం ముందడుగు వేస్తోందన్నారు . రానున్న ఐదు సంవత్సరాల్లో రాష్ట్రాన్ని మరింతగా అభివృద్ధి చేసేలా కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆర్టీసీ స్థలాలను ప్రయివేట్ సంస్థలకు కేటాయించం

## - ఏపీ పిటిడి నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ రాయదుర్గం డిపో



**రాయదుర్గం - సూర్య వాస్తవం, జూలై 26:** ఆర్టీసీ స్థలాలను ప్రైవేటు సంస్థలకు ఇవ్వడాన్ని వ్యతిరేకిస్తూ రాయదుర్గం డిపోలో ఈ రోజు రేపు 26, 27 తేదీలలో ఎర్ర బాడ్జీలతో నిరసన కార్యక్రమాలు రాష్ట్ర రాజధాని నడిబొడ్డున విజయవాడ నందు ఉన్న అత్యంత విలువైన ఆర్టీసీ స్థలాలను ప్రైవేటు సంస్థ లలు కు కేటాయి ంచవద్దని డిమాండ్ చేస్తూ యన్‌యమ్‌యుఎ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు రాయదుర్గం డిపో కమిటీ ఆధ్వర్యంలో ఈరోజు స్థానిక ఆర్టీసీ డిపో నందు ఉదయం 5 గంటల మొదటి డ్యూటీ నుండి ఎర్ర బ్యాడ్జి లు ధరించి విధులకు హాజరై నిరసన తెలిపి ఉన్నాము, ఈ సందర్భంగా డిపో కార్యదర్శి హెచ్ తిప్పేస్వామి మాట్లాడుతూ విజయవాడ గవర్నర్ పేట-2 డిపో ,విజయవాడ పాత బస్టాండు స్థలాలను బహుళ జాతి సంస్థ లలు షాపింగ్ మాల్‌కు ఇచ్చే ప్రతిపాదనలు విరమించుకోవాలని డిమాండ్ చేయడమైనది, ప్రయాణికుల భవిష్యత్తు రవాణా అవసరాలకు ఉపయోగపడే ఆర్టీసీ స్థలాలు అన్యాక్రాంతం కాకుండా కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వం పై ఉందనితెలియజేశారు. ఈ కార్యక్రమంలో రీజనల్ నాయకులు దామోదర్, సిద్దేశు లు మరియు డిపో కార్యదర్శి తిప్పేస్వామి, గ్యారేజ్ అధ్యక్ష కార్యదర్శులు దూద్ పేరా, సతీష్ కుమార్, ప్రచార కార్యదర్శి నఫీస్, సిసిఎస్ డెలిగేటి నాగరాజు, తిమ్మరాజు, ప్రసాద్ బాబు, ఎస్ఎంకే నాయక్, రామాం జనేయులు, రాఘవ, చిన్న మల్లప్ప, వన్నూరప్ప, ఇబ్రహీం, చిట్టెమ్మ, పార్వతి బాయ్, జి ఎల్ రామాంజి, కరిబసప్ప ,శర్మాస్, మస్తాన్, వన్నూరు స్వామి, విజయ్, హెచ్ఎం రావు, సత్తార్ ఖాన్, లక్ష్మీనారాయణ, షేక్షావలి, ఔట్సోర్సింగ్ ఉద్యోగులు పాల్గొన్నారు.




# పైసలు కొట్టు.. సదరం పట్టు..




- సదరం ముఠా గుట్టు రట్టు - రోగుల శారీరక వైకల్యమే ఆసరాగా తీసుకొని అక్రమ వసూళ్లు
- డాక్టర్ల సంతకాలు సైతం ఫోర్జరీ చేశారన్న ఆరోపణలు ...? - మినిస్టర్ పేషీ కి ఫిర్యాదులు
- విచారణకు ఆదేశించిన సూపరిండెంట్...!.
- ఇరవై ఐదు వేల నుండి ముప్పై వేల వరకు డిమాండ్ - ఆప్తమాలజీ, ఆర్థోపెడిక్ సదరం క్యాంప్‌లో అక్రమ వసూలుకు పాల్పడుతున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు -ఆందోళనలో నిరుపేద రోగులు, బాధితులు

అనంతపురం వైద్యం - సూర్య వాస్తవం

అనర్హులకు సదరం సర్టిఫికెట్లు అందజేస్తున్న ముఠా గాళ్లను వేటు వేసి కఠిన చర్యలు తీసుకునేందుకు రంగం సిద్ధం చేశారు...అనంతపురం జిల్లా ప్రభుత్వ సర్వజన ఆసు పత్రిలో అక్రమ వసూలు చేస్తున్న ముఠా గుట్టు రట్టయింది. యధావిధిగా జరిగే సదరం క్యాంప్‌లో శారీరక లోపాలు ఉన్న వారు దరఖాస్తుచేసుకుని ఆసుపత్రికి సంప్రదింగా రోగుల బలహీనతను ఆసరాగా చేసుకొని కొందరు వసూలుకు పాల్పడుతున్నారు. ఆప్తమాలజీ , ఆర్థోపెడిక్ డిపార్ట్మెంట్స్ లో పనిచేసే రికార్డు క్లర్క్ లు ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు చాలా ఏళ్లుగా ఇదే విభాగం లో పనిచేస్తూ రోగులతో అసభ్యంగా ప్రవర్తిస్తూ సదరం సర్టిఫికెట్ సవ్యంగా కావాలంటే డబ్బులు ఇవ్వాల్సిందే అని బలవంతంగా వసూలుకు పాల్పడుతున్నారు. ఎందుకు డబ్బులు ఇవ్వాలి అని ఎదురు తిరిగిన వారికి ఏదొక సాంకేతిక కారణాలతో డాక్టర్ రిపోర్టును అప్లోడ్ చేయకుండా నిలుపుదల చేసి పదే పదే ఆసుపత్రి చుట్టూ తిప్పించుకొని చివరికి తమ పంతం నెగ్గించుకొనేలా డబ్బులు వసూలుకు పాల్పడుతున్నట్లు బయటపడింది. నేడు ఆసుపత్రికి సదరం క్యాంప్ దరఖాస్తుదారులు హాజరుకాగా వారితో అమర్యాదగా ప్రవర్తించి బెదిరింపులకు పాల్పడి డబ్బులు డిమాండ్ చేయడంతో బాధితులు హెల్త్ మినిస్టర్ సత్యకుమార్ పేషికి విషయం అందజేశారు.

ఆగ్రహం వ్యక్తం చేసిన నాయకులు సూపరిడెంట్ అధికారులు తో మాట్లాడి తక్షణం వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు . భవిష్యత్ లో ఇలాంటివి పునరావృతం కాకుండా చూడాలన్నారు. స్పందించిన సూపరిడెంట్ తక్షణ చర్యల నిమిత్తం ఆప్తమాలజీ డిపార్ట్మెంట్ లో పనిచేసే ఉద్యోగి పై చర్యలు నిమిత్తం ప్రిన్సిపాల్ కు లేఖ రాశారు. పేరుకే ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, కానీ వారి ఆదాయం నెలకు లక్ష్యలో ఉంటుందని బాధితుల అంచనా. ఆ కారణం


GOVERNMENT OF ANDHRA PRADESH
FAMILY HEALTH & WELFARE DEPARTMENT

From, Dr.M.Athmaram, MS, Superintendent (FAC), Govt. General Hospital, Ananthapuramu.
To The Principal, Govt. Medical College, Ananthapuramu.

Rc.No. SPL /E1/GGH-ATP/2025, Dated: .07.2025

Sir,

Sub: APM&HS – GGH-ATP – Sri D.Shivaiah, Record Clerk working as steno in the Department of Ophthalmology ,GGH, ATP (...) worked at Sadaram section of GGH, ATP) - certain complaints received against the individual - disciplinary action - Requested –Regarding.

Ref: Instructions of the addl.DME/ Superintendent, GGH, ATP.

<><><><>

It is to inform you that, Sri D. Shivaiah, Record Clerk working as st... in the Department of Ophthalmology, Govt. General Hospital, Ananthapura... and also he worked at sadaram section of Govt. General Hospi... Ananthapuramu.

Further it is informed that ,the individual was demanded money fr... the sadaram applicants /patients. Several complaints was brought to the not... of the undersigned and Hon'ble Health Ministers pashi also.

Hence, I request that necessary disciplinary action should be tak... against the individual and furnish the compliance report to this offi... immediately.

Yours faithfully,
Addl. DME./Superintendent(FAC)
Govt. General Hospital,
Ananthapuramu.

Copy to the HOD of Ophthalmology , GGH/GMC, Ananthapuramu.
Copy to the Nodal officer –Sadaram section , GGH, ATP.
Copy to the CS RMO, GGH, ATP .
Copy to file.

చేతనే వారు విభాగాలు మారకుండా ఉండటానికి ఎంతకైనా తెగిస్తున్నారు. ఆర్థోపెడిక్ విభాగం లో రికార్డు క్లర్క్ గా పనిచేసే ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు సదరం క్యాంప్ వస్తె కాసుల పంటలా భావిస్తున్నారు. సదరం క్యాంప్‌లో రోగిని పరీక్షించడానికి ముగ్గురు డాక్టర్స్ సంతకాలు చేయాల్సి ఉంది. వీరి దగ్గరకు పోయి "మా వాళ్ళే కొంచెం చూడండి అని " ఒక డాక్టర్‌తో సంతకాలు చేయిస్తారు. మిగిలిన సంతకాలు ఫోర్జరీ చేసి తమ ముఠా సభ్యులైన డాటా ఎంట్రీ ఆపరేటర్‌కు పంపుతారు.

తమకు రావాల్సిన పేమెంటు అందిన వెంటనే వారివి అప్లోడ్ చేస్తున్నారు. హెల్త్ విజిటర్ రోగులకు డాక్టరు యం. ఆర్. ఐ స్కాన్ రాసిన రిఫర్ కాగితం పై స్టాంప్ వేయడానికి 300 నుండి ఆరువందల వరకు వసూలు చేస్తున్నారనే వాదనలు ఉన్నాయి. అడిగినంత ఇవ్వకుంటే మరుసటి రోజు రిపోర్టు రానట్టే. ఇలా ప్రభుత్వాసుపత్రిలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు నీరు పేద రోగులతో లక్ష్యాల్లో వసూలుకు పాల్పడుతున్న విషయం హృదయవిదారకంగా ఉంది. తక్షణమే వీరిని ప్రభుత్వం అధికారులు కఠినంగా చర్యలు తీసుకొని వేరే చోటకు పంపాలని మరికొందరు ఆందోళన చేస్తున్నారు.

## పలు వివాహ వేడుకల్లో పాల్గొన్న

# రాష్ట్ర టీడీపీ కార్య నిర్వాహక కార్యదర్శి

**అన్నమయ్య బ్యూరో -సూర్య వాస్తవం, జూలై 26:** అన్నమయ్య జిల్లా రాయచోటిలోని అజయ్ కళ్యాణ మండపంలో శనివారం జరిగిన రాయచోటి పట్టణం గాలివీడు రోడ్ లక్ష్మీపురం వాస్తవ్యులు టీచర్ తోట రాజా సునందల కుమార్తె గీతాంజలి వెడ్స్ దీపక్ తేజల వివాహ వేడుకలో రాజధాని కల్యాణమండపంలో జరిగిన రాయ చోటి పట్టణం సుబ్బారెడ్డివీధి వాస్తవ్యులు నానపు కృష్ణయ్య కుమార్తె దేవి వెడ్స్ వెంకటకిషోర్‌ల వివాహ వేడుకలో రాయచోటి పట్టణం ప్రీతం కళ్యాణమండపంలో జరిగిన శిబ్యాల గ్రామం సిద్ధారెడ్డిగారిపల్లె వాస్తవ్యులు భోజనపు



రెడ్డి వెంకట రమణ కుమారుడు శివకుమార్ వెడ్స్ దివ్యశ్రీ (రామిశెట్టి విశ్వేశ్వ రయ్య కుమార్తె కొండ్రెడ్డిగారిపల్లె నూలివీడు గ్రామం)ల వివాహ వేడుకల్లో రాజంపేట నియోజ కవర్గం టి సుండుపల్లె మండలం చిన్నగొల్లపల్లె గ్రామం కొటికేవాండ్లపల్లెలో వరుని స్వగృహంలో కొటికె సుబ్బారామ నాయుడు కుమారుడు యోగ నరసింహులు నాయుడు వెడ్స్ రమాదేవిల వివాహ వేడుకలలో రాష్ట్ర టిడిపి కార్య నిర్వాహక కార్యదర్శి టీటీడీ పాలకమండలి మాజీ సభ్యులు రాయచోటి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు సుగవాసి ప్రసాద్ బాబు పాల్గొని వివాహ శుభాకాంక్షలు తెలియజేశారు.

## టాస్క్ ఫోర్స్ సిబ్బందికి

# అమర హాస్పిటల్‌లో మెగా మెడికల్ చెకప్






**తిరుపతి-సూర్య వాస్తవం, జూలై 26:** తిరుపతి ఎర్ర చందనం అక్రమ రవాణా నిరోధక టాస్క్ ఫోర్స్ (ఆర్ఎస్ఏఎస్టీఎఫ్) సిబ్బందికి అమర హాస్పిటల్ లో శని వారం మెగా మెడికల్ చెకప్ ప్రారంభమయ్యింది. గౌరవ ఏపీ డీజీపీ హరీష్ కుమార్ గుప్త ఉత్తర్వులు మేరకు, టాస్క్ ఫోర్స్ హెడ్ ఎల్. సుబ్బారాయుడు పర్యవేక్షణలో టాస్క్ ఫోర్స్ లోని పోలీసులు, అటవీ శాఖ ఉద్యోగులతో పాటు అవుట్ సోర్సింగ్ సిబ్బందికి పూర్తి స్థాయి మెడికల్ చెకప్ లు చేపట్టారు.

శనివారం ప్రారంభమైన ఈ కార్యక్రమానికి టాస్క్ ఫోర్స్ ఎస్పీ పీ. శ్రీనివాస్ హాస్పిటల్ ఎండీ డాక్టర్ గౌరినేని రమాదేవి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ పీ శ్రీనివాస్ మాట్లాడుతూ టాస్క్ ఫోర్స్ సిబ్బందికి వార్షిక మెడికల్ చెకప్ చేయడానికి ఈ ఏడాది అమర హాస్పిటల్ ముందుకు రావడం హర్షణీయమని అన్నారు. టాస్క్ ఫోర్స్ సిబ్బంది యావన్మందికి రెండు రోజులు పాటు మెడికల్ చెకప్ చేస్తున్నారని తెలిపారు.

అమర ఎండీ రమాదేవి మాట్లాడుతూ టాస్క్ ఫోర్స్ సిబ్బంది పట్ల తనకు ప్రత్యేక గౌరవం ఉందని అన్నారు. పుష్ప సినిమాలో ఉన్నది సినిమా హీరో అయితే, రియల్ హీరోలు టాస్క్ ఫోర్స్ సిబ్బందే నని కొనియాడారు. మున్ముందు అవసరమైన ఇతర చికిత్సలు కూడా అందజేస్తామని చెప్పారు. అమర చైర్మన్ డాక్టర్ గౌరినేని ప్రసాద్ మాట్లాడుతూ ఆరోగ్యం గా ఉండటమే జీవితంలో నిజమైన విజయం సాధించడమని తెలిపారు. మెడికల్ చెకప్ లో భాగంగా రక్త పరీక్షలు, బీపీ, ఈసీజీ లాంటి టెస్ట్ లు చేశారు.

ఈ కార్యక్రమంలో డీఎస్పీలు జి. బాలిరెడ్డి. వీ. శ్రీనివాస రెడ్డి, ఏసీఎఫ్ జె. శ్రీనివాస్, ఆర్ఐలు కృపానంద, సాయి గిరిధర్, సీఐ సురేష్ కుమార్, ఎస్ఐ రఫీ, ఇంకా ఆర్ఎస్ఐలు, ఇతర సిబ్బందితో పాటు హాస్పిటల్ జీఎం ఆనంద్, సీఈఓ భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS , 13-2-819-2 RAMBOW RESIDENCE , RTC BUS STAND ROAD, SRINIVASA NAGAR, ANANTAPURAM, ANDHRAPRADESH-515001, VIJ. ADDRESS : SHEETAL APARTMENT, TF2 DR NO : 30-2-15/IE VIJAYAWADA-10, EDITOR : M.IRSHAD BAIG, CELL : 918500425222 ( ASSOCIATE EDITOR -N.ARIF ALI )